ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు
జిల్లా వార్తలు

5

ఆదివారం 27 అక్టోబరు 2024





నరసరావుపేటలో నిలిచిపోయిన శీతల గిడ్డంగి

ఇంకా ఇన్‌చార్జి పాలనలోనే

- గుంటూరు జేసీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమాకం
- మిర్చియార్డు, జీడీసీసీబీ, జీడీసీఎంఎస్ పదవుల భర్తీలో జాప్యం
- నియామకాలపై మరికొన్ని నెలలు పట్టే అవకాశం ఉందని సంకేతాలు









గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం జరుగుతున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదో నెల సమీపిస్తున్నా ఇంకా ముఖ్యమైన పదవులు భర్తీ చేయకపోవడంపై టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో కొంత నిరాశ నెలకొన్నది. ఇదే సమయంలో ఆయా పోస్టులకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తుండటంతో భర్తీ చేయడానికి మరికొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉందన్న విషయాన్ని చెప్పకనే చెప్పినట్లు అవుతున్నది. నామినేటెడ్ పదవుల్లో టీడీపీకి 80 శాతం, బీజేపీ, జనసేన కలిపి 20 శాతం పంపిణీ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. ఆ మేరకు కసరత్తు జరిపి ఒక నిర్ణయానికి వచ్చేసరికి కొత్త సంవత్సరం వస్తుందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. నామినేటెడ్ పదవుల్లో అత్యంత ప్రాధాన్యం కలిగినది గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) ఛైర్మన్ పదవి. ఏటా రూ.2 వేల కోట్ల వరకు టర్నోవర్ కలిగి ఉన్న మిర్చియార్డు ఛైర్మన్‌తో పాటు పాలకవర్గంలో ఇతర పదవులకు కూడా ఎక్కువమంది ఆశిస్తుంటారు. ఇదేరీతిన గుంటూరు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీబీ) ఛైర్మన్ పదవి. ఈ పదవికి నామినేట్ అయితే బ్యాంకు రుణాల రూపంలో ఎంతోమందికి సాయం చేయొచ్చు. అలానే జీడీసీఎంఎస్ ఛైర్మన్ పదవి. రైతులు పండించిన ఉత్పత్తుల కొనుగోళ్ల విషయంలో ఛైర్మన్, పాలకవర్గం సహాయ పడొచ్చు. ఈ ముగ్గురికి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉంటుంది. అలానే జిల్లా సమీక్ష మండలి సమావేశానికి కూడా హాజరై సమస్యలను ప్రస్తావించొచ్చు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం శ్రమించిన పలువురు నాయకులు ఆయా పదవులు ఆశిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తమ అభ్యర్థిత్వాలను బలపరుస్తూ సిఫార్సు లేఖలు తీసుకుని పార్టీ హైకమాండ్‌కు నివేదిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ మూడు కీలక పదవులపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. దీంతో పరిపాలన కుంటుపడకుండా ఉండేందుకు గుంటూరు జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే కనీసం మరో మూడు నెలల పాటు అయినా ఆయా పదవుల భర్తీ జరగకపోవచ్చన్న అభిప్రాయం మూడు పార్టీల శ్రేణుల్లో వ్యక్తమౌతున్నది. నామినేటెడ్ ఛైర్మన్‌లు ఉంటే పనులు చేయించుకోవడానికి సులభతరంగా ఉంటుం దని, అదే ఐఏఎస్ అధికారి వద్ద ఆ పరిస్థితి ఉండదన్న అభిప్రాయాన్ని చెబుతున్నాయి.

సేవలు.. శూన్యం

వ్యవ.. సాయం లోపించిన మార్కెట్ యార్డులు. రైతుల నుంచి సెస్సు వసూలు చేస్తూ సేవలు విస్మరించిన కమిటీలు. యార్డుల ద్వారా అన్నదాతలకు అందాల్సిన పథకాలన్నీ రద్దు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిస్థితి. రైతుల కోసం ఏర్పడిన.. రైతుల సేవలో నిమగ్నమవ్వాల్సిన వ్యవసాయ మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా మిగిలాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగానే మిగిలాయి. గతంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతూ వస్తున్న రైతుబంధు పథకం రద్దైంది. రైతులకు లబ్ధి చేకూర్చే ఈ-మార్కెటింగ్ విధానాన్ని ఆపేశారు. పొలాలకు లింకురోడ్ల నిర్మాణాలు, ఉచిత పశు వైద్య శిబిరాలు, గోదాముల నిర్మాణాలు శూన్యంగా మారాయి.

- అలంకారప్రాయంగా మార్కెట్ యార్డులు
- సెస్సు వసూళ్లపై శ్రద్ధ.. విస్మరించిన సంక్షేమం
- కమిటీల ఖాతాలకు ఏటా రూ.కోట్లలో ఆదాయం
- యార్డుల ద్వారా అన్నదాతలకు అందాల్సిన పథకాలన్నీ రద్దు
- కూటమి ప్రభుత్వంలో యార్డుల పాలకవర్గాల నియామకాల్లో జాప్యం
- మళ్లీ మార్కెట్ యార్డులకు పూర్వవైభవం రావాలని కోరుతున్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులు మోసపోకుండా.. ఉత్పత్తుల విక్రయాల్లో నష్టపోకుండా.. అన్నదాతలకు అండగా.. రైతుల కోసం ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా మారాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 24 వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలో లక్షల మంది రైతులున్నారు. అయితే ఒక్క యార్డు పరిధిలో.. ఒక్క రైతుకు కూడా ఐదేళ్లుగా ఒక్క ప్రయోజనం కూడా అందలేదు. మార్కెట్ యార్డులు అన్నదాతలకు సేవలు అందించడంలేదు. వ్యయసాయ దిగుబడులపై ఒక శాతం సెస్సు(పన్ను)ను ముక్కుపిండి వసూలు చేసే మార్కెట్‌కమిటీలు వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం కమిటీల ఖాతాల్లో చేరుతున్నా ఆ నిధులను వారికోసం ఖర్చు చేయడంలేదు. అన్నదాతలకు మార్కెట్‌యార్డుల ద్వారా అందించాల్సిన పథకాలను కూడా ఎత్తేశారు. మార్కెట్ యార్డుల కమిటీల నుంచి రైతులకు ఏ ఒక్క ప్రయోజనం కూడా కలగడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలు నాశనమైనట్లే మార్కెట్‌యార్డుల పరిస్థితి కూడా మారిందని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్ యార్డుల ద్వారా రైతులకు అప్పటికే అందే సేవలను కొనసాగిస్తూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేవన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా సేవలు మాట దెవుడెరుగు అప్పటి వరకు కొనసాగిన పథకాలు, కార్యక్రమాలను కూడా రద్దుచేసిందని రైతులు మండిపడుతున్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశాల్లో తీర్మానాలు చేయడమే తప్ప పనులు మాత్రం జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదో నెల సమీపిస్తోంది. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డుల పాలక వర్గాలు భర్తీకి నోచుకోక కమిటీలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక యార్డు కమిటీలను రద్దు చేశారే కానీ కొత్త కమిటీల నియమాకం చేపట్టలేదు.

దోపిడీకి గురవుతున్న రైతులు


రైతులకు విస్తృతమైన సేవలు అందించేందుకు ఏర్పాటైన మార్కెట్ యార్డు లు వారి ప్రయోజనాలను విస్తరిస్తున్నాయన్న విమర్శలు న్నాయి. మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తల ధరలు ప్రతి రోజు యార్డులు ప్రకటించాల్సి ఉంది. ముఖ్యంగా కూరగాయల ధరలు మార్కెట్లలో కూడా ప్రకటించాలి. రైతుకు ఇవ్వాల్సిన ధర అమలు అయ్యేలా యార్డులు కృషి చేయాల్సి ఉంది. కనీసం ధరల పట్టికను కూడా యార్డులు నిర్వహించడలేదని రైతులు వాపోతున్నారు. దీని వలన తాము దోపిడీకి గురౌతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టేనా

కూటమి ప్రభుత్వంలో యార్డులకు మహర్దశ పడుతుందని, తమకు సేవలు అందుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు. రైతు బంధు.. పశువైద్య శిబిరాలు.. పొలాలకు లింకు రోడ్లు.. గోదాములు.. శీతల గిడ్డంగులు నిర్మాణాలు.. మళ్లీ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను వెంటనే నియమించి పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలని రైతులు కోరుకుంటున్నారు.



అటకెక్కిన రైతుబంధు



ఐదేళ్లుగా అన్నదాతలకు రైతు బంధు పథకం అక్కరకు రాలేదు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేని పక్షంలో వాటిని యార్డుల్లో కుదవ పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. పంట విలువలో 80 శాతం వరకు రుణంగా ఇచ్చే అవకాశం ఉంది. ధర వచ్చాక ఆయా ఉత్పత్తులను విక్రయించి రుణాలను తిరిగి తీర్చుకునే వెసులుబాటును కమిటీలు కల్పించాలి. అయితే ఈ పథకం ఐదేళ్ల వైసీపీ పాలనలో అమలు కాలేదు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.

అనుబంధ రహదారులేవి



వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రహదారులను మార్కెట్ యార్డులే నిర్మించాలి. గతంలో ఒక్కో కమిటీ పరిధిలో 30 శాతం నిధులు ఇందుకు కేటాయించేవి. ఒక్కో యార్డు పరిధిలోని ప్రాధాన్యం మేరకు ఏడాదికి 10నుంచి 15 రహదారులు వేసేవారు. రైతుల అభిప్రాయాలు తీసుకుని అవసరమైన మేరకు ప్రాధాన్యం ఇచ్చేవారు. గత ఐదేళ్లలో ఒక్క రహదారి నిర్మాణం కూడా జరగలేదు. అసలు రైతుల కోసం ప్రతిపాదనలు కూడా లేవు.

వైద్య శిబిరాలు ఎత్తేశారు



రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉండే పాడి సంపద అభివృద్ధికి గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్ కమిటీలు పెద్ద పీట వేసేవి. యార్డుల పరిధిలో ఏడాదికి నాలుగు పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసే వారు. వ్యాధులతో బాధపడుతున్న పశువులకు ఒకే చోటకు చేర్చి సంపూర్ణ వైద్యం అందించి ఉచితంగా మందులను కూడా ఇచ్చేవారు. ఒక్కో శిబిరానికి రూ.10 నుంచి రూ.20 వేలు వరకు ఖర్చు చేసేవారు. అయితే ఐదేళ్లుగా పశు వైద్య శిబిరాల నిర్వహణ లేదు. అయితే ఆయా నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. పాడి పశువులకు చికిత్స కోసం రైతులు సొంతంతగా ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది.

గోదాముల నిర్మాణాలు నై..



మార్కెట్ కమిటీల నిధులతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించాలి. ఐదేళ్లలో ఒక్కటి కూడా నిర్మించలేదు. దీని వల్ల మార్కెట్ కమిటీలకు ఆదాయం పోతోంది. మరోవైపు రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ప్రైవేటు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని రుసుములు చెల్లించుకుంటున్నారు. దీని వల్ల పంట అమ్మిన మొత్తాల్లో సగం వరకు నిల్వకే ఖర్చవుతోంది. రైతులు దళారుల వలలో పడకుండా ఈ-మార్కెటింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో కొనుగోళ్ల జరపాలని నిర్ణయం తీసుకుంది. ఈ విధానం కూడా పక్కాగా అమలు కావడంలేదు. ప్రతి మార్కెటింగ్ కమిటీ కొనుగోలు కేంద్రంగా మారాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రకారం ఎక్కడా ఉత్పత్తుల కొనుగోళ్లు జరగలేదు.

బతికుండగానే చంపేశాడు

- రౌడీషీటర్ కోసం కానిస్టేబుల్ బరితెగింపు
- చనిపోయిన వైసీపీ నేత డెత్ సర్టిఫికెట్ రౌడీషీటర్‌కు కేటాయింపు
- ఎస్ఐ సంతకం ఫోర్జరీ చేసి కోర్టుకు పత్రాల సమర్పించిన వైనం
- పోలీసు శాఖ, న్యాయ వ్యవస్థను తప్పుదారి పట్టించినా చర్యలపై మీనమేషాలు



గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కరుడుగట్టిన రౌడీషీటర్‌ను పోలీసులే చంపేశారు. చంపడం అంటే ఇక్కడ ప్రాణం తీయడం కాదు.. ప్రాణం పోయడం. రౌడీషీటర్‌పై కోర్టులో ఉన్న కేసులను తీయించడం కోసం ఏకంగా కోర్టు కానిస్టేబుల్ బరితెగించాడు. పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపుతున్న ఈ ఘటనకు సంబంధించి ఆలస్యంగా వెలుగు చూసిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన పాదర్తి రమేష్, మధు సోదరులు. గతంలో వీరు రౌడీషీటర్ నల్లపాటి శివయ్యకు ప్రధాన అనుచరులుగా ఉండేవారు. కారసాని హత్యానంతరం శివయ్యకు పాదర్తి సోదరులకు మధ్య మనస్పర్థలు వచ్చాయి. నరసరావుపేట పరిధిలోని చిన్నకాకాని వద్ద పాదర్తి మధును, మరొకరిని నల్లపాటి శివయ్య, ఆయన అనుచరులు హత్య చేశారు. శివయ్య అనుచరులకు పాదర్తి రమేష్‌కు మధ్య ఆధిపత్యపోరు సాగింది. ఈ నేపథ్యంలో శివయ్య అనుచరులను చంపిన కేసులో రమేష్ నిందితుడిగా ఉన్నాడు. పాదర్తి రమేష్‌పై రెండు హత్యలు, అనేక హత్యాయత్నాలు, పలు దాడులు,

(మిగతా 8వ పేజీలో..)

యువజన చాంపియన్.. హిందూ కళాశాల

8





ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల యువజనోత్సవాలు శనివారంతో ముగిశాయి. యువజనోత్సవాల ఓవరాల్ చాంపియన్‌గా గుంటూరులోని హిందూ కళాశాల, రన్నరప్‌గా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సొంతం చేసుకున్నాయి. విజేతలకు సినీహీరో సోహైల్, బిగ్‌బాస్ ఫేమ్ శ్రీసత్యలు బహుమతులు అందజేసి విద్యార్థులతో సందడి చేశారు.





ఎఫెక్ట్ రేపటి నుంచి

6

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పాఠశాలలకు పూర్వవైభవం

- జీవో నం.117 రద్దు నిర్ణయంపై ఉపాధ్యాయుల హర్షం
- ప్రపంచ బ్యాంక్ నిధుల కోసమే జీవో అంటూ ఆరోపణ
- అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 80వేల మంది ప్రైవేటు బాట

గుంటూరు(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో సంస్కరణల పేరుతో నాటి వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో న.117తో ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక విద్య కళను కోల్పోయింది. రెండేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 వేల మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాల నుంచి ప్రైవేటు బాట పట్టారు. తాజా ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ జీవోను వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు

(మిగతా 6వ పేజీలో..)



యువశక్తి.. ఒత్తిడితో అంతం

8




- పని ఒత్తిడి తాళలేక ఉద్యోగి ఆత్మహత్యాయత్నం
- కళాశాలల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు
- అప్పుల బాధ తాళలేక కుటుంబం బలవన్మరణం
- వ్యసనాలు వీడలేక పదహారేళ్లకే ఉరి

పీఎం స్వానిధిలో జీఎంసీకి అవార్డు

- చిరు వ్యాపారులకు రుణాలు అందించడంలో గుర్తింపు
- విజయవాడలో 29న అవార్డు అందుకోనున్న కమిషనర్



కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు పీఎం స్వా నిధి రుణాల అందించడంలో జాతీయస్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థ(జీఎంసీ) అవార్డుకు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వ పీఎం స్వా నిధి ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 24,197 దరఖాస్తులకు 21,594 మంది చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించింది. అత్యధిక సంఖ్యలో చిరు వ్యాపారులకు రుణాలు అందించి గుంటూరు నగర పాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో జాతీయ స్థాయి అవార్డుకు గుంటూరు నగర పాలక సంస్థ ఎంపికైనట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం తెలిపారు. చిరు వ్యాపారులకు రుణాలు అందించి అండగా నిల్చిన మెప్మా సిబ్బందికి కమిషనర్ అభినందనలు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచినందుకు మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అభినందన కార్యక్రమంలో అవార్డును గుంటూరు కార్పొరేషన్ తరఫున అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గుంటూరు సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు శుభవార్త. ఈ నెల 28 నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు కేంద్రాలను తెరవనుంది. శనివారం 'ఆంధ్రజ్యోతి' గుంటూరు జిల్లా సంచికలో ప్రచురితమైన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'గిట్టుబాటు గగనం' కథనానికి విజయవాడ రీజియన్ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్పందించారు. గుంటూరు మార్కెటింగ్ కార్యాలయంలో ఆరు జిల్లాలకు చెందిన వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్, ఏలూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర పొడుగు పింజ, నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా క్వింటాకు రూ.7521గా ప్రకటించారని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలను వివిధ మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేశామని తెలిపారు.



సమావేశంలో మాట్లాతున్న జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీ రాజబాబు

టోకెన్ పొందిన తర్వాత మాత్రమే..

రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని అమ్మకానికి తెచ్చుకునే ముందే ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని టోకెన్ పొందాలని, ఆ తర్వాత మాత్రమే పత్తిని మార్కెట్ యార్డుకు లేదా జిన్నింగ్ మిల్లులకు తెచ్చుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు ప్రక్రియ సోమవారం (ఈ నెల 28వ తేదీ) నుంచి ప్రారంభంకానున్నది. తేమ శాతం 8, అంతకంటే తక్కువ నుంచి 12 వరకు మాత్రమే ఉండాలి. 8 నుంచి 12 శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతానికి మద్దతు ధరలో ఒక శాతం తగ్గిస్తారు. రైతులు వాడుకలో ఉన్న వారి బ్యాంక్ ఖాతాలను, ఆధార్ నంబర్లతో అనుసంధానం చేసుకోవాలి. అటువంటి ఖాతాలకు మాత్రమే నేరుగా నగదు చెల్లింపులు జరుగుతాయి. సమావేశంలో మార్కెటింగ్ గుంటూరు ఏడీ బి.రాజబాబు పాల్గొన్నారు.

ఐదు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు

గుంటూరు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో 2, (కోటేశ్వరా కాటన్ ట్రేడింగ్ కంపెనీ, అంకిరెడ్డిపాలెం, శ్రీసోమేశ్వర ట్రేడింగ్ కంపెనీ, పుల్లడిగుంట), తాడికొండ పరిధిలో 1 (శివ సాయి టీఎంసీ, కోయవారిపాలెం), ఫిరంగిపురం పరిధిలో 1 (శ్రీవిజయ వేంకటేశ్వర కాటన్ మిల్స్, మేడికొండూరు), ప్రత్తిపాడు పరిధిలో 1(శ్రీసాయి ట్రేడర్స్, ప్రత్తిపాడు) జిన్నింగ్ మిల్లులను గుర్తించి పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు శనివారం వెల్లడించారు. రైతులు మధ్యవర్తులు, దళారుల వద్దకు వెళ్లకుండా నాణ్యమైన పత్తిని నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు.

కొద్దిపాటి జాగ్రత్తలతో ఆనంద దీపావళి

● జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి



గుంటూరు సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళిని సంతోషంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో శనివారం నుంచి దీపావళి మందుల అమ్మకాలకు సంబంధించి లైసెన్స్‌లు పొందే ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలో

ఫటాఫట్

దీపావళి స్టాల్స్ ఏర్పాటు చేసే వ్యాపారులు, పండగను నిర్వహించే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై జిల్లా అగ్నిమాపక అధికారి ముక్కు శ్రీనివాసరెడ్డితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్.

దీపావళి మందులు విక్రయించే వ్యాపారులకు లైసెన్సు ఎవరిస్తారు?

డీఎఫ్‌వో: వ్యాపారి స్టాల్ ఏ ప్రదేశంలో పెడుతున్నారు. అక్కడ ప్రజల నివాసాలు, వ్యాపార సముదాయాలు తదితర విషయాలను సంపూర్ణంగా పరిశీలించి మేము నిరభ్యంతర సర్టిఫికెట్ ఇస్తాం. ఆ తర్వాత ఆర్డీవో లైసెన్స్ మంజూరు చేస్తారు.

ఎంతమంది లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు?

డీఎఫ్‌వో: ఎంతమంది అనేది ఇప్పుడే చెప్పలేము. కానీ ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మంది తాత్కాలిక లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇప్పుడు లైసెన్సు పొందిన వాళ్లు ఈ నెల 28,29,30,31 తేదీల్లో మాత్రమే మందులు విక్రయించాలి.

విక్రయించే వాళ్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

డీఎఫ్‌వో: స్టాల్స్ ఏర్పాటు చేసేటప్పుడు తగలబడే స్వభావం లేని మెటీరియల్‌తో షాపులు నిర్మించుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో షాపు ఉండేలా చూసుకోవాలి. షాపుకి, షాపుకి మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి. పెట్రోల్ బంకుకు 15 మీటర్ల దూరంలో స్టాల్స్ పెట్టుకోవాలి. స్టాల్స్ ఉన్న ప్రదేశంలో పొగతాగటం నిషేధం. ప్రతి షాపు వద్ద రెండు బక్కెట్లలో నీళ్లు, రెండు బక్కెట్లలో ఇసుక ఉంచుకోవాలి.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

డీఎఫ్‌వో: పండగ జరుపుకునే సందర్భంలో కాటన్ దుస్తులు ధరించాలి. దీపావళి మందులు ఎట్టిపరిస్థితుల్లోనూ కిచెన్‌లో, మూసివున్న గదుల్లో పెట్టకూడదు. పిల్లలు మందులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దవాళ్లు పక్కనే ఉండాలి. గ్రామాల్లో పూరిగుడిసెలు, గడ్డివాముల దగ్గర మందులు కాల్చకూడదు.

దీపావళి పండగ ఆనందభరితం కావాలంటే?

డీఎఫ్‌వో: దీపావళి పండగ ప్రతి ఇంటిలోనూ కొత్త వెలుగులు నింపాలంటే కొద్దిపాటి మెలకువలు పాటించాలి. మన అజాగ్రత్త మరొకరికి శాపంగా మారకూడదు. చిన్న నిర్లక్ష్యం పెను ప్రమాదానికి దారితీస్తుంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వెలుగుల పండుగను జరుపుకోవాలి.



వేడుకలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి

రెంటచింతల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గురజాలలో బంధువుల ఇంట నిర్వహించే వేడుకలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. రెంటచింతలకు చెందిన చిరుమామిళ్ల లింగయ్య (57) శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై గురజాలకు బయలుదేరాడు. దారిలో రహదారి మరమ్మతుల నిమిత్తం మట్టి కుప్పగా పోయడంతో వాహనం దానిపైకి ఎక్కి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన లింగయ్యను తొలుత గురజాల, పిడుగురాళ్ల ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో చివరకు గుంటూరుకు తరలించి ఆపరేషన్ చేసిన తరువాత శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు సంతానం ఉన్నారు.



పాఠశాలలకు మళ్లీ పూర్వవైభవం

(5పేజీ తరువాయి)

చేస్తామని ప్రకటించడంతో అటు ఉపాధ్యాయుల్లో, ఇటు తల్లిదండ్రుల్లో హర్షాతిరేకం వ్యక్తం అవుతోంది.

వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 2,773 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 3.56 లక్షలు మంది ఉన్నారు. ఆయా విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారే. వైసీపీ ప్రభుత్వం జీవో నం.117 ద్వారా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని యూపీ, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో దాదాపు 2 లక్షల మందికిపైగా విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో చేరకుండా ప్రైవేటు బాట పట్టారు. ఈ విషయం గురించి ఎన్నిసార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సంఘాలు తీసుకెళ్లినా స్పందించలేదు. ప్రపంచ బ్యాంకు ఇచ్చే రుణం కోసం ఇలా ప్రాథమిక పాఠశాలల్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యకు తీవ్ర విఘాతం

ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నం.117 వలన ప్రాథమిక పాఠశాలలు దాదాపు నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెలకొంది. నాడు నేడు పథకం ద్వారా అనేక పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించారు. తీరా విద్యార్థులు పాఠశాలల్లో చేరే సమయంలో 3,4,5 తరగతుల్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఒకే కుటుంబంలో ప్రాథమిక విద్యను అభ్యసించే ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు ప్రాథమిక పాఠశాలలో 1 లేదా 2 తరగతుల్లో ఉండగా, కొంతమంది ఉన్నత పాఠశాలల్లో విలీనం అయిన 3,4,5 తరగతుల్లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి కుటుంబాల్లో అనేక మంది ప్రభుత్వ స్కూల్స్‌లో పిల్లల్ని మాన్పించి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. అనేక ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం తొలుత అమ్మఒడి డబ్బులు చెల్లిస్తేచాలంటూ అడ్మిషన్ ఇచ్చిన తరువాత యథావిధిగా ఫీజులు వసూలు చేయడం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం భారీ సంఖ్యలో ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 400 ప్రాథమిక పాఠశాలల్లో తీవ్ర స్థాయిలో ఉపాధ్యాయుల కొరత నెలకొంది.

ఎన్‌డీఏ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ఎన్‌డీఏ ప్రభుత్వం జీవో నం.117 రద్దుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం. ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5, తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెలకొంది. ఊరి బడికి ఉరి పేరుతో ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. కేవలం నిధుల కోసమే జీవో తీసుకువచ్చారు. ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులు ఒకే చోట ఉండాలి.

- పి.ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు

వీవీఐటీకి భారత బ్లాక్ చెయిన్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కళావతి

పెదకాకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి కార్యాలయంలో నిర్వహించిన భారత్ బ్లాక్ చెయిన్ యాత్ర గ్రాండ్ ఫినాలే 2024 కార్యక్రమంలో వీవీఐటీ కళాశాల ఆంధ్రప్రదేశ్ నుంచి అకడమిక్ ఎక్సలెన్స్ 2024 పురస్కారాన్ని అందుకున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ శనివారం తెలిపారు. భారతదేశంలోని 18 రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు, విధాన రూపకర్తలు హాజరైన ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి సీతారాం, ఏఐసీటీఈ చీఫ్ కోర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ చైర్మన్ ప్రొఫెసర్ అనీల్ సహస్రబుధే, బ్లాక్ చెయిన్ యాత్ర కన్వీనర్ ఒరుగంటి అరవింద్ చేతుల మీదుగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఆళ్ల కళావతి ఈ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. భారతదేశంలో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఆవిష్కరణలను, నిపుణులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిన విద్యాలయాలకు ఈ పురస్కారం అందించారని తెలిపారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ పై పరిశోధనలు, విద్య ప్రతిభ కనబరచి గణనీయమైన అభివృద్ధికి సహకరించినందుకుగానూ వీవీఐటీ కళాశాలకు ఈ పురస్కారం దక్కిందని వివరించారు.

ప్రమాదవశాత్తూ ఇద్దరు మహిళలు మృతి



మహిళల మృతదేహాల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బొల్లాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ ఇంకుడు గుంతలో పడి ఇద్దరు మహిళలు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొల్లాపల్లి గ్రామంలో విజయవాడకు చెందిన కొందరు గ్రామ శివారుకు రెండు కిలోమీటర్ల దూరంలో 80 ఎకరాల పొలంలో శ్రీగంధం మొక్కలు సాగు చేస్తున్నారు. దీనిలో భాగంగా పనుల నిమిత్తం ఆర్నెల్లు క్రితం ఒరిస్సా రాష్ట్రం నుంచి 38 మంది పొలాల్లో పని చేయటానికి ఇక్కడకు వచ్చారు. వీరు మూడు నెలల నుంచి శ్రీగంధం మొక్కల పొలాల్లో పని చేస్తున్నారు. అయితే శ్రీగంధం పొలంలో 80 ఎకరాల తోటకు నీటి కోసం మూడు ఎకరాల విస్తీర్ణంలో పంపు సెట్టు ఏర్పాటు చేశారు. దాని పక్కనే సుమారు ఏడు అడుగుల లోతుతో ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. ఇక్కడే మహిళలు బట్టలు ఉతకటం, స్నానం చేయటం వంటివి చేస్తుంటారు. అలాగే రోజు వారిలో భాగంగా గురువారం ఉదయం మున్నంగి ఉమ(16), మేలక జున్ను(17) ముఖం కడుక్కొని స్నానం చేసేందుకు ఇంకుడు గుంత వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ వారు ఇంకుడు గుంతలో పడి మృతి చెందారు. పక్కనే ఉన్న స్థానిక మహిళ ఇది గమనించి స్థానికులకు తెలియ జేయగా వారు వచ్చి ఇద్దరిని బయటకు తీశారు. అప్పటికే వారు మరణించారు. ఈ విషయాన్ని బొల్లాపల్లి పోలీసులకు గ్రామస్తులు తెలిపారు. సంఘటనా స్థలానికి నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సీఐ బి.ప్రభాకరరావు, ఎస్‌ఐ ఎ. బాలకృష్ణ వచ్చారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నియంత్రించవచ్చు


● విజ్ఞాన్‌లో ఘనంగా వాతావరణ మార్పులపై సదస్సు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పీవీ ప్రకాశరావు

గుంటూరు(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వాతావరణ మార్పులను సమర్థవంతంగా నియంత్రించవచ్చునని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త కార్యదర్శి డాక్టర్ పీవీ ప్రసాదరావు అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రసాదరావు మాట్లాడుతూ చట్టబద్ధ చర్యలు సాంకేతిక పరిష్కారాలకు సరైన మార్గం అన్నారు. దేశంలో జాతీయ వాతావరణ మార్పుల కార్యచరణ ప్రణాళిక ప్రకారం పరిరక్షణ చట్టాలు, పర్యావరణ చట్టాలు, పర్యావరణ మార్గదర్శకాలు, శాస్త్రీయ పరిశోధనల్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు సొలిసిటర్ రమేష్ బి.విశ్వనాథ్ మాట్లాడుతూ క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ, స్మార్ట్ అగ్రికల్చరల్, కార్బన్ కాప్చర్ టెక్నాలజీ వంటి సాంకేతికతలు వాతావరణానికి అనుకూలంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.నాగభూషణ్, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకుందాం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, మాణిక్యరావు

తెనాలి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకుందామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శనివారం తెనాలిలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రవినాయుడు, లిడ్‌కాప్ చైర్మన్ పిల్లిమాణిక్యాలరావు హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభలో రవినాయుడు మాట్లాడారు. పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటమిని సమానంగా తీసుకోవాలన్నారు. ఉపవిద్యాశాఖాధికారిణి శాంతకుమారి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మీవో లక్ష్మీనారాయణ, జయంతి బాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం.రవి, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ గౌరవాధ్యక్షుడు బి.కరిముల్లారావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు వినయ్ కుమార్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

శాస్త్రీయ సంగీత మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే వాగ్గేయకార శాస్త్రీయ సంగీత మహోత్సాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పీ జానకి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్వాన్ వివేక్ మూజికులం, చెన్నై వారిచే ఏర్పాటు చేసిన శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, విజయవాడ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ రామారావు, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్ వీ ఎస్ లక్ష్మీనారాయణ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమాలను సన్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీ.విజయ, ఎం.వై శేషు రాణి పర్యవేక్షించారు.


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్, న్యాయాధికారి లత

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఉంచాలని, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులతో శనివారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐదవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె. లత హాజరయ్యారు. ఈ సందర్భంగా కే. లత మాట్లాడుతూ పోలీస్, జ్యుడిషియల్, ప్రాసిక్యూషన్ వారు కలిసి కోర్టు ట్రయల్ కేసులలో శిక్షల శాతం పెరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఈ ఏడాది జూలై 7 నుంచి కొత్త చట్టాలు అమలు జరుగుతున్నా యని, ఆ చట్ట ప్రకారం కేసులు చేసే సమయంలో పాత చట్ట ప్రకారం రిపోర్టులో చెబుతున్నదీ, కొత్త చట్టం ప్రకారం ఏ సెక్షన్ వేయాలో తెలుసుకొని కేసు రిజిస్టర్ చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వారెంట్లు, పెండింగ్ కేసులు, దొంగతనం కేసుల గురించి విపులంగా అధికారులకు వివరించారు. ఆయా కేసులను ప్రతి మూడు నెలలకు ఓసారి జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకొని పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించుకోవచ్చని తెలిపారు. కేసు దర్యాప్తు విషయంలో పాటించాల్సిన మెలకువలను అధికారులకు తెలియజేశారు. ఇటీవల లోక్ అదాలత్‌లో కేసుల్లో ఎక్కువగా డిస్పోజల్ చేసిన అధికారులను, సిబ్బందికి ఆమె ప్రశంశా పత్రాలు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పెండింగ్ లో ఉన్న కేసుల విచారణ వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రౌడీషీటర్లను కచ్చితంగా స్థానిక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ దగ్గర ఐదు లక్షల రూపాయల పూచీకత్తుతో బైండోవర్ చేయించాలని అధికారులను ఆదేశించారు.


వడ్లమూడి నాగేంద్రకు చెక్కును అందజేస్తున్న హేమాద్రి వెంకటరమణరావు

ఉపకార వేతనాల నిధికి రూ.2లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కమ్మ బాలికల వసతి గృహంలో వసతి పొందుతున్న పేద, ప్రతిభ కల్గిన విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన ఉపకార వేతనాల సహాయ నిధికి పంచాయితీరాజ్, విశ్రాంత సహాయక ఇంజనీరు దావులూరి హేమాద్రి వెంకటరమణరావు రూ.2లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ చెక్కును శనివారం స్థానిక కుందులరోడ్డులోని వసతి గృహ ఆవరణలో కమ్మ జన సేవ సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రంకు ఆయన అందజేశారు. కే జే ఎస్ ఎస్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ విరాళాన్ని అందజేసినట్టు ఈ సందర్భంగా వెంకటరమణరావు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ఘంటా పున్నారావు, మర్రిపూడి సీతా రామయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

తణుకు టీడీఆర్ బాండ్ల జారీలో మోసం ప్రభుత్వం చొరవ చూపాలని వినతి

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తణుకులో ఇచ్చిన టీడీఆర్ బాండ్లను 800 మంది బిల్డర్లు కొనుగోలు చేశారని, వాటి జారీలో మోసం జరిగిందంటూ బ్లాక్ చేశారని, తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి బిల్డర్ల సమస్యను పరిష్కరించాలని తణుకు టీడీఆర్ బాండ్ల బాధిత సంఘం గుంటూరు జిల్లా కన్వీనర్ యాగంటి అవినాష్ తెలిపారు. గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొందరు బాధితులు, బిల్డర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అవినాష్ మాట్లాడుతూ ఈనెల 14 న ప్రభుత్వ పోర్టల్ నుండి టీడీఆర్ బాండ్లను అధికారికంగా కొనుగోలు చేసిన 29 తణుకు బాండ్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ప్రభుత్వాన్ని, అధికారులకు పలుమార్లు కలిసి సమస్య పరిష్కరించాలని కోరినా ఫలితం లేకపోవడంతో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామన్నారు. హైకోర్టు విచారణ జరిపి రెండు నెలల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ ఈ సమస్య ఇంతవరకు పరిష్కారం కాలేదని అన్నారు. ఈ సంక్షోభం నుండి బిల్డర్లను రక్షించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఆక్రమణల కూల్చివేత సరే, కాల్వల నిర్మాణాలెప్పుడు?

● శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో స్థానికుల ఆవేదన
● రెండు నెలలుగా ఇబ్బంది
● దుర్వాసనతో ఉండలేని పరిస్థితి

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూల్చివేసిన ఆక్రమణలు, నోరు తెరిచిన మురుగు కాల్వలు ఒకవైపు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరు ఆ కాల్వల్లో పడిపోతారోనన్న భయాందోళనలు మరోవైపు. ఈ పరిస్థితి స్థానిక శ్రీనివాస రావుపేటలో ఉంది. రెండు నెలల కిందట స్థానిక శ్రీనివాస రావుపేట 60 అడుగుల రోడ్డు, అడ్డరోడ్లలో ఆక్రమణలను ఎక్కడికక్కడ కూల్చి వేశారు. ఇళ్ల ముందు పెద్ద కాల్వలు చేసి వదిలేశారు. అడ్డొచ్చినా వృక్షాలను సైతం నేలకూల్చటం కూడా విమర్శలకు దారితీసింది. అయితే, ఆక్రమణలు తొలగించటంపై కూడా కొందరు హర్షం వ్యక్తం చేశారు. కానీ, నెలలు గడుస్తున్నప్పటికీ పగలగొట్టిన రహదారులకు ఇరువైపులా కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ళ ముందు ఉన్న కాల్వలు ఉండటంతో ఏ సమయంలో ఎక్కడ అందులో పడిపోతారేమోనని భయపడిపోతున్నారు. ఇటీవల ఒకరిద్దరు చిన్నారులు, వృద్ధులు కాల్వల్లో జారిపడినట్లు స్థానికులు చెబుతున్నారు. మురుగునీటి వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పలువురు స్థానికులు తమ ఇళ్ళ ముందు రాక పోకల కోసం రూ. వేలకు వేలు వెచ్చించి చెక్క బల్లలు కొనుగోలు చేసుకున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్ ప్రత్యేకదృష్టి సారించి కాల్వలు, అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాల్వల నిర్మాణం వెంటనే చేపట్టండి

కోనేటి గోవిందరావు, ఆర్‌టీఐ కార్యకర్త



రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించినా కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వీధి కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంటోంది. మూడు, నాలుగు అంతస్థుల భవన నిర్మాణాలు చేపట్టిన చోట్ల కనీసం పార్కింగ్ కూడా లేని పరిస్థితి. శ్రీనివాసరావుపేటలోని ఆయా సమస్యలపై నగర పాలక సంస్థ యంత్రాంగం దృష్టి సారించాలి.


ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చేందుకు మురుగు కాల్వలపై ఏర్పాటు చేసుకున్న చెక్కలు

టీడీపీకి బలం, బలగం కార్యకర్తలే : ఎమ్మెల్యే మాధవి


మొబైల్ యాప్‌లో పార్టీ సభ్యత్వం నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని అమరావతి రోడ్డు భారత్ పేట మెయిన్ రోడ్డులో సభ్యత నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి, పార్టీ నేతలకు సభ్యత్వ పునరుద్ధరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్న నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించినప్పుడు కార్యకర్తలే ప్రచార సాధకులుగా మారి 9 నెలల్లోనే ఆయనను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. నాటి నుంచి నేటి వరకూ కార్యకర్తలే పార్టీకి బలం, బలగం అని కొనియాడారు. సభ్యత్వ రుసుము రూ.100 అని, సంవత్సరం కాల పరిమితి వుంటుందని, శాశ్వత సభ్యత్వం కావాలంటే లక్ష రూపాయల సభ్యత్వ రుసుము పొందవచ్చని తెలిపారు. శాశ్వత సభ్యత్వాన్ని తీసుకుంటే, వారికి దురదృష్టవశాత్తు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబానికి అండగా రూ.5 లక్షలను కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా అందిస్తారన్నారు. విజనరీ నేత చంద్రబాబు అడుగుజాడల్లోని ప్రతి ఒక్కరు నడవాలని, పార్టీ సభ్యత్వం పొందాలని ప్రజలకు ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు చేసి రాష్ట్రంలోనే టాప్ టెన్‌లో ఒకటిగా నిలిపేందుకు కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మద్దిరాల మ్యాని, తెలగతోటి సుధీర్, మార్కు, చింతకాయల వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ టీడీపీ కుటుంబ సభ్యులు కావాలి: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రియాశీలక సభ్యత్వాన్ని చేయించుకొని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పిలుపు నిచ్చారు. స్థానిక వెంగళరావునగర్‌లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 26 నుంచి ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రతి ఒక్కరితో సభ్యత్వం నమోదు చేయించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు,కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గోళ్ళ ప్రభాకర్, గుడిమెట్ల దయారత్నం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నసీర్‌కు సీఐటీయూ వినతి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే నసీర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్న నేటికి హామీలు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్‌కు వర్క్‌షాపులు, సెమినార్లు

● ఎమ్మెల్యే బీ రామాంజనేయులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికంగా విద్యార్థులకు ఎప్పటి కప్పుడు వర్క్ షాపులు, హేథాన్, సెమినార్ల వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా వారిలో నైపుణ్యతను వెలికి తీస్తూ, భవిష్యత్‌కు బంగారు బాటలు వేయటమే లక్ష్యం కావాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. మండలంలోని పుల్లడి గుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి 15 వసంతాలు పూర్తి చేసకున్న సందర్భంగా శనివారం ప్రారంభమైన కార్య క్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్యను అందిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న మలినేని సంస్థల కృషి అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ ప్రముఖ ఐటీ బహుళ జాతి సంస్థల్లో తమ కళాశాల విద్యార్థులకు స్థానం ఉండటం వారి పతిభకు నిదర్శనమని అన్నారు. తొలిరోజున ప్రముఖ సినీ గాయకులు శ్రీ రామచంద్ర ప్రత్యక్ష సంగీత విభావరి ,విద్యార్థినిల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాస కుమార్, డీమ్ అకడమిక్ ప్రొఫెసర్ జే కిషోర్, డీన్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ డాక్టర్ పీ రమేష్ బాబు పాల్గొన్నారు.

21 మంది యువకులకు ఉద్యోగావకాశాలు

గుంటూరు సిటీ, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 21 మంది యువకులకు ఆహార ఉత్పత్తుల సంస్థలో మెషీన్ ఆపరేటర్లుగా ఉద్యోగాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారిని ఎంపిక చేశారు. మొత్తం 60 మంది యువతీ,యువకులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా, 21 మంది ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను డీఆర్‌డీఏ పీడీ టివి విజయలక్ష్మి అభినందించారు.

ఓపెన్ బాస్కెట్ బాల్ టోర్నమెంటులో సీతారామయ్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినిలను అభినందిస్తున్న పాఠశాల సెక్రటరీ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డెక్కన్ బాస్కెట్ బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19, 20 తేదీలలో జరిగిన ఓపెన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ హై స్కూల్ విద్యార్థినిలు ప్రతిభ చాటారని పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమెన్స్ విభాగంలో తమ పాఠ శాలలో 8, 9 ,10 తరగతుల్లో చదువుతున్న నిహారిక, చరిత,స్వప్న, సహస్ర, శరణ్యసుదారాణి ,అక్షయ తృతీయ స్థానంలో విజయాన్ని సాధించారని అన్నారు. తమ పాఠశాలలోని విద్యార్థులకు ఆరు గురు వ్యాయామ ఉపాధ్యాయులతో మెరుగైన శిక్షణ ఇస్తున్నామని,తద్వారా అన్ని క్రీడల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ కే.రవిని, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. రైల్వే బోర్డు మాజీ సలహాదారులు ఎ.సుబ్బారావు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఎల్.కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జె.పద్మజ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● రెడ్‌క్రాస్ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు


అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. స్థానిక భారతీయ విద్యా భవన్‌లో శనివారం జరిగిన రెడ్‌క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వింగ్స్ ఆధ్వర్యంలో కళాశాలల్లోని విద్యార్థులకు రక్తదానం, ప్రథమ చికిత్సల శిక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ వంటి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటుగా యువతలో నైపుణ్యం వెలికి తీసే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్య క్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. చిన్న వయస్సులో విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్ని కళాశాలల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. రక్తదానంపై అపోహలు తొలగించాలని, రోగులకు అన్ని వేళల్లో రక్తదాతలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ 2023-24లో 27 శిబిరాలు నిర్వహించి 3410 యూనిట్లు రక్తసేకరణ జరిపినట్లు తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న వివిధ కళాశాలలు, పరిశ్రమల వారికి కలెక్టర్ అవార్డులు అందజేశారు. వందసార్లు రక్తదానం చేసిన ఉమామహేశ్వరరావును, విజయవాడ వరదల్లో చక్కటి సేవలు అందించిన బెస్ట్ వాలంటీర్ ఖాజా శ్రీహరి, ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్న డాక్టర్ పావని ప్రియాంకలను సత్కరించి మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఏ రవిశ్రీనివాస్, కార్యదర్శి రఘు స్వర్ణ, సభ్యులు మట్టుపల్లి మోహన్, థామస్ సెబాస్టియన్, డాక్టర్ రమణ యశస్వీ, డాక్టర్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు స్వీకరణ

గుంటూరు సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ లిస్టుపై ఈ నెల 26 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొన్ని నెలల క్రితమే ప్రారంభించి ఇప్పటికే గ్రూపు-4, క్లాస్-4 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. మొత్తం 54 ఖాళీలను గుర్తించి పోస్టుల భర్తీ ప్రక్రియని చేపట్టామని, మిగిలిపోయిన రీడ్ అండ్ రైట్ అర్హత కలిగిన పబ్లిక్‌హెల్త్ వర్కర్, స్వీపర్, గ్యాంగ్‌మజ్దూర్, డ్రెయిన్ క్లీనర్, కలాశి, హోల్‌టైం సర్వెంట్ వంటి 20 పోస్టుల కూడా భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://గుంటూరుఏపీ.ఇన్/2023లో ఈ నెల 26వ న అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. స్వీకరించిన అభ్యంతరాలను జిల్లా సెలక్షన్ కమిటీ పరిశీలించి వాటిని పరిష్కరించిన తర్వాత తుది మెరిట్ జాబితాని ప్రకటిస్తుందని వివరించారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య),అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన ఇంటర్ స్పోర్ట్స్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులుప్రాథమిక స్థాయి నుంచే క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి చేరడానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. తొలుత స్పోర్ట్స్‌మీట్, భాష్యం బ్లూమ్స్ జెండాలను ఆవిష్కరించి క్రీడా జ్యోతిని విద్యార్థుల నుంచి రామకృష్ణ అందుకున్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, ప్రిన్సిపల్స్ కవిత, గిరిజారాణి, జేడీఇవో వరలక్ష్మి పాల్గొన్నారు.


లలిత హాస్పిటల్స్‌కు ప్రతిష్టాత్మక 'డైమండ్ అవార్డు'

● వరుసగా నాల్గవ ఏడాది ఈ అవార్డు కైవసం


డైమండ్ అవార్డుతో న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు అబుదాబిలో జరిగిన 16వ వరల్డ్ స్ట్రోక్ కాంగ్రెస్-2024 సదస్సులో గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వరుసగా నాల్గవ ఏడాది కూడా డైమండ్ స్టేటస్ అవార్డును సాధించింది. పక్షవాతం రోగులకు ఉత్తమ చికిత్సలు అందించడంలో ఈ ప్రతిష్టాత్మకమైన అవా ర్డును వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ఏంజిల్స్ ఇనిషియేటివ్ ద్వారా న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ అందుకున్నారు. పక్షవాతానికి అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కొన్ని కేంద్రాలలో తమ కేంద్రం ఒకటని లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రాఘవ శర్మ తెలిపారు. అబుదాబి సదస్సులో రికరెంట్ బ్రెయిన్ స్ట్రోక్‌లకు గల కారణాలపై న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ పరిశోధనా పత్రం సమర్పించారని, విజయ క్లీవ్‌ల్యాండ్ క్లినిక్‌ను సందర్శించి అక్కడి న్యూరో సైంటిస్ట్‌లతో అత్యాధునిక సాంకేతికతలపై చర్చించారని తెలపారు.

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో నూతన భవనానికి ఎమ్మెల్యే జీవీ శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు తదితరులు

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారి సమాజ కార్యక్రమాలకు ఎల్లవేళలా తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. గుంటూరు అశోక్ నగర్ 5వ లైన్ లోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యజ్ఞంలో తమవంతు సహకారం ఎక్కువ ఉండాలని ప్రతి ఒక్కరూ సంకల్పం చేసుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. ఓం శాంతి బ్రహ్మకుమారి ప్రజాహిత విశ్వవిద్యాలయంలో తాను శాశ్వత సభ్యుడిని అని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

● ఏఏవో చంద్రశేఖర్

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నెలాఖరు సందర్భంగా ఆదివారం కూడా ఎన్‌టీఆర్ బస్టాండ్ వెనుకనున్న ఈఆర్‌వో రూరల్ 1 కార్యాలయం తెరిచే ఉంటుందని, వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించుకోవచ్చని ఏఏవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. డోక్కిపర్రు, ఫిరంగిపురం, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లో కూడా ఈఆర్‌వో కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ

నగరపాలక సంస్థ జనన,మరణాల విభాగం డీఎస్‌ఓ ఎం. వీరప్రసాదరావు



గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ చేస్తున్నామని, ప్రజల అవసరాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు నగరపాలక సంస్థ జనన, మరణాల విభాగ డీఎస్‌ఓ ముప్పరాజు వీర వరప్రసాదరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.....

ఏ ఏడాది నుంచి జనన,మరణ ధ్రువపత్రాలు జీఎంసీ నుంచి ఇస్తారు?

డీఎస్‌ఓ: 2016 డిసెంబర్ 1 నుంచి గుంటూరు నగరంలో జన్మించిన, మరణించిన వారికి జీఎంసీనుంచి మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయబడతాయి.

2016 కు ముందు జనన, మరణ పత్రాలు ఎక్కడ పొందాలి?

డీఎస్‌ఓ: 2016 నవంబర్ 31 ముందు జనన, మరణ ధ్రువపత్రాలను సచివాలయాలలో లేదా 'మీ సేవ'లో మాత్రమే పొందగలరు.

తప్పుల సవరణకు, జనన, మరణ తేదీల్లో మార్పునకు అవకాశం ఉందా?



డీఎస్‌ఓ: కేవలం అక్షర దోషాలకు మాత్రమే అవకాశం ఉంది.దరఖాస్తుదారులు రెండు ఆధారాలు, నోటరీ, గెజిటెడ్ సంతకంతో దరఖాస్తుల సమర్పించాలి. జనన మరణాలకు సంబంధించిన తేదీలు, నెలలు, సంవత్సరాల మార్పిడికి అవకాశమే లేదు.

జనన,మరణాలు ఎన్ని రోజుల్లోగా నమోదు చేసుకోవాలి?

డీఎస్‌ఓ: జనన, మరణాలు జరిగినప్పుడు 21వ రోజు లోపు ఉచితంగా నమోదు చేస్తాం. తదుపరి 30 రోజుల్లోపు ఆలస్య రుసుంతో నమోదు. జనన నమోదు తర్వాత ఒక ఏడాదిలోపు బిడ్డ పేరు ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. తదుపరి నోటరీ, ఆలస్య రుసుముతో నమోదు చేయించుకోవాలి.

జనన, మరణాలు నమోదు కాకపోతే ఏం చేయాలి?

డీఎస్‌ఓ: జనన, మరణాలు జరిగినప్పుడు ఏడాది లోపు అయితే నమోదు చేయబడతాయి. అది దాటితే ఆర్డీవో ఉత్తర్వులతో మాత్రమే నమోదు చేస్తాం.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


ఎస్వీఎన్ కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఎస్.వి.ఎన్.కాలనీ, హౌసింగ్ బోర్డు, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో కమిషనర్ శనివారం పర్యటించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం పరిశీలించి, ఇంజినీరింగ్, ప్రజా రోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని ఎస్.వి.ఎన్.కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్.ఎల్.ఆర్.లో మోటార్ల మరమ్మతుల వలన సరఫరాలో సమస్య ఏర్పడిందని చెప్పిన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. ఎస్.వి.ఎన్.కాలనీ మెయిన్ రోడ్ ని ఎన్.క్యాప్ నిధులతో ఎండ్ టు ఎండ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదన్న ఫిర్యాదు మేరకు ప్రజారోగ్య అధికారులు, గ్యాంగ్ వర్క్ ద్వారా వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో పర్యటించి, కాలనీలోని యూజీడీ లైన్లు పూర్తి స్థాయిలో వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. కాలనీలో పలు ప్రాంతాల్లో వర్షం నీరు వెళ్లడానికి కల్వర్ట్ లు సరిగా లేకపోవడం గమనించిన ఆయన, నూతన కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని, ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. బ్రాడిపేటలోని మున్సిపల్ పార్క్‌ని పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ ని పరిశీలించి, పార్క్‌లో ముఖ్యమైన అభివృద్ధి పనులను జీఎంసీ చేపట్టిందని, సాధారణ నిర్వహణను స్థానిక వాకర్స్ అసోసియేషన్ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

టిడ్కో నివాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉండే ప్రజలకు జీఎంసీ నుండి అందే మౌలిక వసతుల కల్పనలో అధికారులు శ్రద్ధ తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ టిడ్కో గృహ సముదాయాలను అధికారులతో కలిసి పరిశీలించి, స్థానికులతో సమస్యలపై వివరాలు తీసుకొని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారు లకు తగు ఆదేశాలు జారీ చేశారు.

వీధి కుక్కల నియంత్రణకు సహకరించాలి

నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు యాంటి బర్త్ కంట్రోల్ (ఏబీసీ)కి సహకరించాలని, ఏబీసీ చేసే ఏజన్సీ నిబంధనలను పటిష్టంగా పాటించేలా జీఎంసీ నుండి ప్రత్యేక పర్యవేక్షణకు అధికారులను కేటాయిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో శనివారం వీధి కుక్కల నియంత్రణ, సమస్యలు, పరిష్కార మార్గాలపై వివిధ జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జీఎంసీ, ప్రభుత్వ పశువైద్య విభాగ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు ఏబీసీ కోసం ఏటుకూరు రోడ్డులోలో ప్రత్యేక సెంటర్ ని ఏర్పాటు చేశామని, అందులో స్నేహ యానిమల్ వెల్ఫేర్ సంస్థ ఏబీసీ చేస్తుందని, ఏబీసీ నిర్వహణపై పలు స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు పలు ఫిర్యాదులు చేస్తున్నారని, తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఏబీసీ మెరుగ్గా జరిగేందుకు ప్రభుత్వ పశువైద్య విభాగం నుండి ఒక డాక్టర్‌ని డెప్యుటేషన్ లో తీసుకుంటామని, త్వరలో లోకల్ మోనిటరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. విడతల వారీగా ఏబీసీ సెంటర్‌ని పరిశీలనకు గుర్తింపు పొందిన జంతు ప్రేమికుల సం స్థల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తామని, వారు పరిశీలించిన అంశాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

డీవీసీ హాస్పిటల్‌కు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు


గుర్తింపు పత్రాన్ని తీసుకుంటున్న డీవీసీ ఎండీ జ్యోతిర్మయి

పొన్నూరుటౌన్(చేబ్రోలు),అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ గుర్తింపు లభించినట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి తెలిపారు. ఎన్ ఎబిహెచ్ సంస్థ ప్రతినిధులు శనివారం ఇందుకు సంబంధించిన గుర్తింపుపత్రాన్ని హాస్పిటల్‌లో ఎండి జ్యోతిర్మయికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీవీసీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఆనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. పాల రైతులకు రాయితీపై వైద్యం అందిస్తునట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించటంలో ముఖ్యభూమిక పోషిస్తునందునే జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. ఇందుకు సహకరించి హాస్పల్ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్; సహచర పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



యువశక్తి

ఒత్తిడితో.. అంతం

- పని ఒత్తిడి తాళలేక ఉద్యోగి ఆత్మహత్యాయత్నం
- కళాశాలల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు
- అప్పుల బాధ తాళలేక కుటుంబం బలవన్మరణం
- వ్యసనాలు వీడలేక పదహారేళ్లకే ఉరి

ఇటీవల కాలంలో తరచూ ఎక్కడ చూసినా ఇవే సంఘటనలు. క్షణికావేశానికి, చిన్నపాటి సంఘటనకు తట్టుకోలేక అనేక మంది నిండు నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే అంతం చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల ఈ ఆత్మహత్యల పరంపర మరీ అధికమవుతుంది.. ఇదేదో ఒక వర్గానికే సంబంధించిగా ఉండటం లేదు.. ఉన్నత వర్గాల నుండి విద్యావంతుల నుండి నిరుపేద వరకు అనేక మంది ఈ దారిలో పయనిస్తున్నారు.. అందునా 14 నుండి 35 ఏళ్ల లోపు యువ శక్తి ఇందులో ఎక్కువగా ఉంటుంది.

ఆత్మహత్యకు కారణాలు ఇవే..!

- ఒంటరితనం, ఆరోగ్య సమస్యలు.
- నీతి బాహ్య ప్రవర్తన
- స్థాయికి మించి ఆశలు, లక్ష్యాలు
- పరిధులు దాటిన ఊహలు
- ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, కిందిస్థాయి సిబ్బంది సహకార లోపం
- చాలీ చాలని జీతాలు, ఆర్థిక సమస్యలు
- అవసరాలు తీరకపోవడం

ఇవి సంకేతాలు...!

- గుండె వేగంగా కొట్టుకోవడం
- రక్తపోటులో తీవ్ర హెచ్చుతగ్గులు రావడం
- తీవ్రమైన తలపోటు
- భరించలేని విసుగు
- ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గుదల
- మత్తుపదార్థాలకు బానిస కావడం

నియంత్రిద్దాం... హాయిగా జీవిద్దాం

- మితిమీరిన కోరికలు, అవసరాలు తగ్గించుకోవాలి.
- స్థాయికి మించి అంచనాలు వేసుకోవడం మానాలి
- ప్రతికూల ఆలోచనలను, పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలి
- జరిగిన సంఘటనను పదేపదే ఆలోచించడం మానుకోవాలి
- వాస్తవాన్ని గుర్తించి పరాజయం అంగీకరించే స్వభావం పెంచుకోవాలి
- యోగా ధ్యానం వంటివి చేయాలి
- భావాలను ఆలోచనలను కుటుంబ సభ్యులతో పంచుకోవాలి

నరసరావుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో భారీ సంఖ్యలోనే ఆత్మహత్యల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో చిన్నా పెద్దా అన్ని వర్గాల వారూ ఉన్నారు. వాస్తవానికి ప్రాణం తీసుకునేంత సమస్య వీరు ఎదుర్కొంటున్నారా అంటే అదీ కాదు. ప్రతి చిన్న సమస్యను బూతద్దంలో చూస్తూ సమస్య పరిష్కరించుకోలేక జీవితాన్ని తుంచేసుకుంటున్నారు. ఒక్క క్షణం ఆగి ప్రశాంతంగా ఆలోచిస్తే ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు నిండు జీవితాన్ని ఆస్వాదించవచ్చు. ఈ విషయాన్ని మనో వికాస మార్గదర్శకులు, మనస్తత్వ నిపుణులు పదే పదే చెప్తున్నారు.

ఆధునిక సమాజంలో కాలంతో పోటీ పడుతూ పరిగెడుతున్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య. ఎవర్ని కదలించినా ఒకే మాట. అదే సమస్య ఒత్తిడి, విద్య, ఉద్యోగం, ఆర్థిక పరిస్థితి, కుటుంబ విషయాలు, పరువు ప్రతిష్టలు ఇలా ఏదో ఒక సమస్య. ఒకటేమిటంటే నిద్ర లేచింది మొదలు, మళ్లీ పడకపైకి చేరే వరకు ప్రతి అడుగులోనూ ఏదో ఒక సమస్య. యాంత్రిక జీవితంలో ఈ సమస్యలే ఒత్తిడిగా మారుతున్నాయి. ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఎందరో వారి జీవితాలను బలి తీసుకుంటున్నారు.

మరణం పరిష్కారం కాదు..

జీవితం అన్నాక ఒడిదుడుకులు సహజం. కుటుంబ సమస్యలకు తోడు ఉద్యోగంలోనూ ఎన్నో ఒత్తిళ్లు ఉంటాయి. లక్ష్యాల పేరుతో ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఉంటాయి. కింది స్థాయి ఉద్యోగుల సహకారం లభించదు. ఇవి ఉద్యోగుల కష్టాలు. రైతుకు వేరే కష్టాలు, వృత్తిదారునికి మరో కష్టం. ఇలా అందరికీ కష్టాలు ఉంటాయి. సమస్యలకు పరిష్కారాలు వెతకాలే కానీ వాటి నుండి తప్పించుకోవడానికి ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం మంచి పద్ధతి కాదు.

ఉమ్మడి కుటుంబాల తగ్గుదలే కారణం

ఆధునికత పేరుతో పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో ఉమ్మడి కుటుంబాలను దూరం చేసుకోవడం కూడా ఈ బలవన్మరణాలకు ఒక కారణం అవుతోందని అంటున్నారు మానసిక వికాస నిపుణులు డాక్టర్ ఉమాజ్యోతి. కష్టసుఖాల్ని పంచుకోవడానికి పెద్దలు లేక పోవడం, చిన్న వారితో వాటిని పంచుకోలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆకర్షణకు ప్రేమకు తేడా తెలియని ఆవేశం, పోటీ ప్రపంచంలో పరుగెత్తలేని నెమ్మదితనం యువతను ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు.

మార్కులు ర్యాంకులే జీవితం కాదు

నేటి యువతను పట్టి పీడిస్తున్న అనేక రుగ్మతల్లో మార్కులు, ర్యాంకుల రుగ్మత ఒకటిగా ఉంటుందని పలువురు మేధావులు పేర్కొంటున్నారు. చదువు ర్యాంకులే జీవితం కాదన్న సత్యాన్ని అందరూ గ్రహించాలని పెద్దలు చెబుతున్నారన్నారు. ర్యాంకులు, మార్కుల కోసం జీవితాన్ని వద్దనుకుంటే సాధించేదేమీ ఉండదన్నారు. ఎంత ఖర్చు చేసినా, ఏం చేసినా తిరిగి రానిది ప్రాణం ఒక్కటే అన్న విషయం గుర్తించాలంటున్నారు.



● కౌన్సిలింగ్ కేంద్రాలను సంప్రదించాలి



చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకునే సంఖ్య రోజుకు పెరుగుతుంది. ఇది బాధాకరం. యాంత్రిక జీవితంలో ఎదురవుతున్న పోటీని తట్టుకోలేక చాలామంది ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. ఖాళీ సమయాల్లో వచ్చే ఆలోచనలు కూడా ఆత్మహత్యలును ప్రేరేపిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ కాకుండా ఇతర వ్యాపకాలను అలవాటు చేసు కోవాలి. వ్యాయామం, వాకింగ్, ప్రయాణాలను అలవాటు చేసుకోవాలి. సమస్య వచ్చినపుడు సన్నిహితుల వద్ద ప్రస్తావించుకుని పరిష్కరించుకోవాలి. ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు కౌన్సెలింగ్ కేంద్రాలను సంప్రదించాలి.

డాక్టర్ ఐవీఎల్ నరసింహరావు,సైకియాట్రిస్ట్, గుంటూరు



●'టెలి మానస్'కు విస్తృత ప్రచారాన్ని కల్పించాలి

ఆత్మహత్యల నివారణకు మంగళగిరి వద్ద ఏర్పాటు చేసిన 'టెలి మానస్' విస్తృత ప్రచారాన్ని కల్పించాలి. ప్రభుత్వం తీసుకోచ్చిన 144 16 టోల్ ఫ్రీ నెంబర్‌ను అన్ని విద్యాసంస్థలు, ఇతర సెంటర్ల వద్ద ప్రదర్శించాలి. ఆత్మహత్య ఆలోచన వచ్చిన ప్పుడు ఈ నెంబరుకు ఫోన్ చేస్తే వారు ఫోన్లోనే కౌన్సెలింగ్ ఇచ్చి ఆ ప్రయత్నాన్ని విరమిం చేలా కృషి చేస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఈ సెంటర్ల వల్ల మంచి ఫలితాలు కనిపిస్తు న్నాయి. రాష్ట్రంలో కూడా ఈ సెంటర్‌కు నిధులు కేటాయించి, విస్తృత ప్రచారం కల్పించాలి. అంతేగాక ప్రతి కళాశాలలో చిన్నపాటి కౌన్సెలింగ్ సెంటరు లేని పక్షంలో కనీసం మానసిక నిపుణుని ఏర్పాటు చేయాలి.



డాక్టర్ వీ వెంకట రమణ మానసిక వైద్య నిపుణుడు, జీజీ హెచ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, జీఎమ్‌సీ



పంచారామాలకు ప్రత్యేక బస్సులు

- త్రిశైవ క్షేత్రాలకూ స్పెషల్ సర్వీసులు
- 2 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి



గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆర్టీసీ పంచారామాలకు ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది. త్రిశైవ క్షేత్రాలకు కూడా స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేశారు. ఆయా సర్వీసులు నవంబరు 2 నుంచి భక్తులకు అందుబాటులోకి వస్తాయని జిల్లా ప్రజా రవాణాధికారి(డీపీటీవో) ఎమ్ రవికాంత్ తెలిపారు. పంచారామాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతికి, త్రిశైవక్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలంలను ఒకే రోజులో దర్శించుకునేలా ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను సిద్ధం చేశామన్నారు. అలానే అయ్యప్ప స్వాముల కోసం కూడా అద్దె ప్రాతిపదికను ఇచ్చేందుకు బస్సులను సిద్ధం చేశామన్నారు. శబరిమల యాత్రకు ఆరు రోజులు, 8, 12 రోజుల టూర్ ప్యాకేజీలు ఉన్నాయన్నారు.

పంచారామాల టిక్కెట్ ధరలు ఒక్కొక్కరికి..

బస్టాండ్	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్	సూపర్ లగ్జరీ	ఫోన్‌నెంబర్
గుంటూరు నుంచి	870	1110	1160	9959225420/21
తెనాలి నుంచి	960	1220	1270	9959225422
మంగళగిరి నుంచి	860	1090	1140	9959225424
పొన్నూరు నుంచి	950	1200	1250	9959225267

త్రి శైవక్షేత్రాల దర్శనం కోసం..

బస్టాండ్	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్	సూపర్ లగ్జరీ	డిపోమేనేజర్
గుంటూరు నుంచి	1080	1380	1440	9959225420/21
తెనాలి నుంచి	1160	1480	1540	9959225422
మంగళగిరి నుంచి	1140	1450	1510	9959225424
పొన్నూరు నుంచి	1160	1480	1540	9959225267

బతికుండగానే చంపేశాడు

రౌడీషీటర్ కోసం కానిస్టేబుల్ బరితెగింపు

చనిపోయిన వైసీపీ నేత డెత్ సర్టిఫికెట్ రౌడీషీటర్‌కు కేటాయింపు

(5వ పేజీ తరువాయి)

బాంబుల కేసులు ఉన్నాయి. గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో పాదర్తి రమేష్‌పై ఏ ప్లస్ కేటగిరి రౌడీషీట్ ఉంది. ఈ కేసులు గుంటూరు కోర్టులో విచారణలో ఉన్నాయి. సోదరుడు మధు హత్య అనంతరం రమేష్ గుంటూరు నుంచి దాచేపల్లి మండలం గామాలపాడుకు మకాం మార్చాడు. దీంతో పోలీసులు రౌడీషీట్‌ను గురజాల డీఎస్పీకి బదిలీ చేశారు. ఆ తర్వాత నుంచి అతడు ఎక్కడ ఉంటున్నది ప్రశ్నార్థకంగా మారింది.

వైసీపీ నేత పాదర్తి మృతిని అనుకూలంగా మార్చుకున్న రౌడీషీటర్

గుంటూరుకు చెందిన వైసీపీ నేత పాదర్తి రమేష్‌గాంధీ గత కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా విజయం సాధించారు. మేయర్ పీఠం రేసులో ఉన్న తరుణంలో ఆయన మృతి చెందారు. దీనిని రౌడీషీటర్ పాదర్తి రమేష్ పట్టాభిపురం కోర్టు కానిస్టేబుల్ రాజుతో తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. పాదర్తి రమేష్‌గాంధీ డెత్ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి రౌడీషీటర్ పాదర్తి రమేష్ చనిపోయినట్లుగా గుంటూరులోని వివిధ కోర్టుల్లో కానిస్టేబుల్ సమర్పించాడు. దీనితో రౌడీషీటర్ పాదర్తి రమేష్‌పై ఉన్న కేసులన్నింటిని కోర్టు రద్దు చేసింది. అప్పటి పట్టాభిపురం ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆ డెత్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తూ సంతకం చేసినట్లుగా ఎస్‌ఐ సంతకాన్ని కానిస్టేబుల్ ఫోర్జరీ చేసి కోర్టుకు సమర్పించినట్లు తెలిసింది.

కానిస్టేబుల్‌కు పోలీస్ శాఖ అండదండలు

నేరస్తులకు కోర్టులో శిక్ష పడే విధంగా వ్యవహరించాల్సిన కానిస్టేబుల్ రౌడీషీటర్‌కు అనుకూలంగా చేసిన వ్యవహారం పోలీస్ శాఖలో కలకలం రేపుతుంది. కానిస్టేబుల్ ఇంతగా బరితెగించిన ఘటనపై పోలీస్ అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం కూడా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. సదరు కానిస్టేబుల్‌ను వేరే స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖను, న్యాయ వ్యవస్థను తప్పుదారి పట్టించి తీవ్రమైన నేరాలకు పాల్పడిన కానిస్టేబుల్‌పై పోలీసు ఉన్నతాధికారులు మిన్నకుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివాహేతర సంబంధం పెట్టుకున్న కానిస్టేబుల్‌పై చర్యలు నిల్

గుంటూరు ఏటిఅగ్రహారం నాలుగో లైన్‌లో ఓ పెయింటర్ భార్యతో నగరంపాలెం కానిస్టేబుల్ కిరణ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఒకరోజు కానిస్టేబుల్ తన భార్యతో ఉండగా పెయింటర్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో సదరు కానిస్టేబుల్ పెయింటర్‌ను బెదిరించడంతో ఊరు వదిలి పారిపోయారు వారం రోజులు అనంతరం హైదరాబాదులో ఉన్న తన కుటుంబసభ్యుల సహకారంతో పెయింటర్ నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్‌పై కేసు నమోదైనా పోలీసు అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు.

వర్సిటీలో ముగిసిన ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన



వీసీ ఆచార్య గంగాధరరావుతో భేటీ అయిన కమిటీ సభ్యులు

పెదకాకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్పర్ట్ కమిటీ పర్యటన శనివారంతో ముగిసింది. ఐక్యూఏసీ, లైబ్రరీ, హెర్బల్ గార్డెన్, బొటానికల్ గార్డెన్, ఇంక్యుబేషన్ సెంటర్, వెజిటబుల్ గార్డెన్లను కమిటీ సభ్యులు సందర్శించారు. ఐక్యూఏసీ, నాక్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు పొందేందుకు ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. అధ్యాపకులు పరిశోధకులతో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల వైపు విద్యార్థులను పయనింపచేయాలని అందుకు అనుగుణంగా దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల ప్రవేశాలతో పాటు వారికి ఉద్యోగ అవకాశాల కల్పనపై పరిశీలన చేయాలన్నారు. ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణసత్య, ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, ర్యాంకుల విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ రవి తదితరులు కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు.

లక్ష్యంపై దృష్టి పెట్టండి



యువజనోత్సవ సభలో మాట్లాడుతున్న సినీ హీరో సోహైల్







యువజనోత్సవ సభలో మాట్లాడుతున్న బిగ్‌బాస్ ఫేమ్ శ్రీసత్య

పెదకాకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవితంలో గెలుపోటములు సహజం.. విజయాన్ని సాధించే క్రమంలో తప్పుడుదారులు వెతకొద్దు.. లక్ష సాధన దిశగా దృష్టి సారించాలి.. అని సినీ హీరో సోహైల్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల యువజనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో మంచివారు కొంతమంది మాత్రమే ఉన్నారన్నారు. ఎదిగే వారిని తొక్కేసే రోజుల్లో మనం జీవిస్తున్నామన్నారు. సమాజంలో మంచిని బతికించాలన్నారు. తోటి వారిని ఇబ్బంది పెట్టకుండా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. బిగ్‌బాస్ ఫేమ్ శ్రీసత్య మాట్లాడుతూ చేదు అనుభవాలు ఎదురైనా వాటిని తట్టుకుని నిలబడాలని అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చన్నారు.



రన్నర్‌గా నిలిచిన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

యువజనోత్సవంలో సినీహీరో సోహైల్

ముగింపు సభలో విద్యార్థులతో సందడి చేసిన శ్రీసత్య

ఓవరాల్ చాంపియన్ హిందూ కళాశాల

యువజనోత్సవాల ఓవర్ ఆల్ చాంపియన్‌గా గుంటూరులోని హిందూ కళాశాల నిలిచింది. రన్నర్ స్థానాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సొంతం చేసుకుంది. చివరి రోజు ఫోక్, ట్రైబల్ డాన్స్‌లతో విద్యార్థులు అలరించారు. విచిత్ర వేషధారణలతో విద్యార్థుల చేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య గంగాధర రావు, రెక్టర్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, యువజనోత్సవాల కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్ మురళీమోహన్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఆచార్య పి.జాన్సన్, సైన్స్ ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య స్వరూపరాణి, ఆచార్య కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.





తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైతు మృతదేహం లభ్యం

తెనాలి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై ఎరువుల బస్తాలతో పొలానికి వెళుతూ శుక్రవారం ప్రమాదవశాత్తు కొలకలూరు కొమ్మమూరు కాలువలో పడి గల్లం తైన అదే గ్రామానికి చెందిన రైతు గుమిడి ఏడుకొండలు(58)మృతదేహాన్ని శనివారం పోలీసులు చేబ్రోలు కాలువలో గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని తెనాలి జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.



పొదుపు మహిళల స్టాల్స్‌లో వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

పొదుపు మహిళలు

ఆర్థికాభివృద్ధి సాధించాలి

పొన్నూరుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పొదుపు రుణాలు పొందిన మహిళలు ఆ నగదును తమ ఆర్థికాభివృద్ధికి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు సూచించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కమిషనర్ రమేష్ బాబు ప్రారంభించారు. పొదుపు మహిళలు తయారు చేసిన అనేక రకాల ఉత్పత్తులను, ఆహార పదార్థాలను ఈ స్టాల్స్‌లో విక్రయించారు. కమిషనర్ మాట్లాడుతూ పొదుపు మహిళలు తమ సంఘాల ద్వారా కుటీర పరిశ్రమలుగా ఏర్పాటు చేసుకొని అనేక రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చన్నారు. వీటి విక్రయాల ద్వారా మహిళలు ఆర్థిక ప్రయోజనాలు పొందడమే కాకుండా కుటుంబ ప్రగతికి పాటుపడవచ్చన్నారు. మహిళలు స్వయం కృషితో ఎదిగిన నాడే స్త్రీ సాధికార సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలను

కఠినతరం చేయాలి

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ చట్టాలను కఠినతరం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు అన్నారు. స్థానిక మారీసుపేటలో శనివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) ప్రత్యేక సమావేశాన్ని నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌పీఐ (ఏ) పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల వరప్రసాద్ ఆదేశాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ మధ్యకాలంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగాయని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేసే విధంగా నేరాలు జరగకుండా అన్నారు.కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మోహన్, కట్రగోవ్, బాను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రైక్వాండో పోటీలు ప్రారంభం

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): త్రైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 4వ రాష్ట్ర స్థాయి త్రైక్వాండో టోర్నమెంట్ శనివారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ ప్రారంభించారు. బోసురోడ్డులోని శ్రీలక్ష్మీనరసింహ సోమయాజి వ్యాయామ పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రైక్వాండో పోటీలలో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని కోరారు. ఈ క్రీడల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, కోచ్ కొప్పురౌతు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై నీరు చేరకుండా

చర్యలు తీసుకోవాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రహదారులపై నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సభ్యులు కోరారు. వీఎస్ఆర్ కళాశాల రోడ్డులో ఉన్న మంచినీటి పథకాన్ని శనివారం పరిశీలించారు. కాల్వలో నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసిన తరువాత వేస్ట్‌వాటర్‌ను సక్రమంగా మళ్లించకపోవడంతో కళాశాల పక్కన ప్రధాన రహదారిపై చేరుతుందన్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు అసౌకర్యం కలుగుతుందని, గుంతలో, రోడ్డుపై నీరు ఉండటం వలన గుంతలను గమనించక వాహనదారులు కింద పడుతూ గాయాల పాలవుతున్నారని అన్నారు. వేస్ట్ వాటర్ రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, డీసిల్ట్ లోతులోంచి పీపీఎస్ పైపులైన్ దాఖలు చేయాలన్నట్లు సంఘ అధ్యక్షుడు దర్శి శివకోటేశ్వరరావు, సోమయ్యశాస్త్రి, శంకరరావు, శివరామయ్య, రమేష్ బాబు, ఆరిఫ్ పేర్కొన్నారు.

అవయవ,శరీర దానం

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని నాజర్‌పేటకు చెందిన సిద్దాబత్తిని శివకుమారి (52) మృతి చెందడంతో శరీర అవయవ దానం చేశారు.



శివకుమారి (ఫైల్)

ఆరోటీసీలో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం సోదరి శివకుమారి తన మరణానంతరం కళ్లను, శరీరాన్ని దానం చేయాలని కుటుంబీకులకు తెలిపారు. శివకుమారి శుక్రవారం మృతి చెందగా ఆమె శరీరాన్ని ఎన్‌ఆర్ఐ వైద్య కళాశాలకు అప్పగించారు. శనివారం జరిగిన అంతిమయాత్రలో సీపీఎం నేత బాబుప్రసాద్, నాస్తిక సమాజ కన్వీనర్ మందారి నారాయణ, ములకా శివసాంబిరెడ్డి, శివకృష్ణ, కనపర్తి బెనహర్‌బాబు పాల్గొని శివకుమారికి నివాళులర్పించారు.

ప్లాస్టిక్ మహమ్మారిపై కొరడా ఏదీ?

'ప్లాస్టిక్ ప్రాణాంతకం' అంటూ ప్రచారాలతో ప్రజలను చైతన్యవంతులను చేశామంటున్న తెనాలి మునిసిపల్ అధికారులు పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కొరడా ఝుళిపించటం లేదు. కంటి ముందే కవర్లతో వెళుతున్నా ఉదాసీనత చూపడం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. వర్తక, వాణిజ్య వ్యాపార రంగాల్లో అగ్రగామిగా విరాజిల్లుతున్న తెనాలి పట్టణాన్ని ప్లాస్టిక్ భూతం కబళించనుంది.

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- ప్రమాదంలో ప్రజారోగ్యం..
- అధికారుల ఉదాసీనతతోనే విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకం





తెనాలి మారీసుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెనాలి మార్కెట్ ప్రాంతంలో కూరగాయలు, పండ్లు, నిత్యావసరాలను ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తుంటారు. వీటిని ప్యాక్ చేసి తీసుకువెళ్లేందుకు సౌకర్యంగా ఉండేలా పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. అయితే ప్రభుత్వం తొలుత 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న కవర్లను, ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకూడదని జీవో జారీ చేసింది. తిరిగి 120 మైక్రాన్లకు దాని పరిమితిని పెంచింది. నిషేధిత ఉత్పత్తులను వినియోగించకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ప్రతి రోజు నిత్యవసరాల దుకాణాలు, కూరగాయల విక్రయ వ్యాపారాలు వద్దకు, హోటల్ నిర్వాహకులు, మాంసం విక్రయదారులు ఇలా అన్నిరకాలవారి వద్దకు వెళ్లి ప్లాస్టిక్ పెనుభూతంపై ప్రజలకు వివరించి వాటి వినియోగాన్ని నిలిపివేద్దామని ప్రతిజ్ఞలు చేయించటం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టారు.



పాలిథిన్ కవర్‌లో బొప్పాయి

కొంతకాలంగా మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ విని యోగంపై పట్టించుకోవటం లేదని, ఈ వ్యవహారిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అందుకు రోజురోజుకు పెరిగిపోతున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగమే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిత్యం తెనాలికి వచ్చే వేలాది మంది ఏదో ఒక వస్తువు కొనుగోలు చేసిన వాటిని తరలించేందుకు ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. పంక్షన్లలో మంచినీరు, జ్యూస్‌స్టాల్స్‌లో సైతం జ్యూస్, చెరుకురసం వంటివాటిని అందించేందుకు ప్లాస్టిక్ గ్లాసులను వినియోగిస్తున్నారు. మద్యం షాపుల వద్ద కూడా డిస్పోజ్ ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించడం పరిపాటిగా మారింది. కర్రీస్ పాయింట్లలో కూడా వేడి వేడి కూరలను కవర్లలోనే నింపి పార్సిల్ ఇస్తున్నారు. వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకున్న తర్వాత ఆ వ్యర్థాలన్నింటిని కాలువల్లో పడేయడంతో నీరు పారుదలకు ఆటంకం కలగజేస్తున్నాయి. తెనాలి ప్రాంతంలో మార్కెట్ వద్ద ఉన్న కాలువను పరిశీలిస్తే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజ్ గ్లాసులతో నిండి ఉంటుంది. తెనాలి నుండి అంగలకుదురు వెళ్లే మైనర్ నిండా నిషేధిత ప్లాస్టిక్ పేరుకుపోయి జేఎంజే కళాశాల ప్రాంతం కాలువలోకి కుప్పలు కుప్పలు చేరుతున్నాయి. ఇక జిల్లా ప్రభుత్వ వైద్యశాల డ్రైనేజ్, ఇలా పలు ప్రాంతాల్లోని కాలువలన్నింటిలోనూ ప్లాస్టిక్ ఉత్పత్తులే పోరుకుపోయి కనిపిస్తాయి. జేఎంజే కళాశాల వద్ద ఉన్న కాలువలోకి పట్టణంలోని ప్లాస్టిక్ వచ్చి చేరుతున్నాయి. తెనాలి డంపింగ్ యార్డులో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులపై కొరడా ఝుళిపించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ముందుకు రావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్టీ సభ్యత్వంతో ఎన్నో ప్రయోజనాలు

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్
- పొన్నూరు, పెదకాకాని కేంద్రాల్లో సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభం



పొన్నూరులో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పొందటం ద్వారా ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం అందించి రక్షణ కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. రూ.100 చెల్లిస్తే సభ్యత్వం నమోదు చేయనున్నట్లు చెప్పారు. సభ్యత్వం ద్వారా కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సహాయం లభించనున్నట్లు చెప్పారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నిందిగా సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదకాకానిలో..

పెదకాకాని(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించాలని, జిల్లాలోని పెదకాకాని మండలం పార్టీ సభ్యత నమోదులో ముందుండాలని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. పెదకాకాని మండలంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత గా చురుగ్గా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్

న్యాయవాదిగా తూమాటి

పొన్నూరుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా తుమాటి రమేష్ నియమితులయ్యారు. రమేష్ న్యాయవాదిగా సుదీర్ఘకాలంగా పని చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు శనివారం స్టాండింగ్ కౌన్సిల్ ఉత్తర్వులను తూమాటి రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ తూమాటి రమేష్‌ను మనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వట్టికూటి లీలా ప్రసాద్, షేక్ మగ్బుల్ బేగ్, షేక్ బాజీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె ఇల్లు కోసం వచ్చి...

నగ లాగేసుకెళ్లింది

తెనాలి క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి ఆగంతకురాలు మాటలు కలిపి ఒంటరిగావున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాగేసుకుని పారిపోయిన సంఘటన నాజరుపేటలో జరిగింది. ఈ సంఘటనపై బాధిత వృద్ధురాలు శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాజరుపేటలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న వృద్ధురాలు వెల్లా విజయలక్ష్మి గుర్తు తెలియని 35 సంవత్సరాల వయసు కలిగిన మహిళ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటిలోనికి వచ్చి అమ్మ ఇక్కడ అద్దెకి ఇల్లు ఉంటే కావాలి ఉన్నాయా అంటూ మాటల్లో దింపి కుటుంబ వివరాలు అడుగుతూ, వృద్ధురాలు ఆదమరిచి ఉండటంతో ఆ ఆగంతకురాలు ఆమె మెడలోని బంగారు గొలుసు లాగేసుకుని బయటకు పరుగు తీసింది. ఆమె పరుగును గుర్తించిన వీధిలోని వారు ఏమిటని ప్రశ్నించగా ఆ ఇంటిలో కుక్క వెంటపడింది పరుగెత్తుతున్నాను అని చెప్పి పారిపోయింది. బంగారు గొలుసు రూ.150 లక్షలు ఉంటుందని బాధిత వృద్ధురాలు పోలీసులకు తెలిపింది. దీనిపైకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో

రహదారి నిర్మాణం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజనీర్ కేజే నథానియేల్

పొన్నూరుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నాణ్యతా ప్రమాణాలతో రహదారుల నిర్మాణం జరుగుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజనీర్ కేజే నథానియేల్ అన్నారు. మండల పరిధిలోని మాచవరం, పెదపాలెం గ్రామాల్లో శనివారం రహదారుల నిర్మాణాన్ని చీఫ్ ఇంజనీర్ పరిశీలించారు. జీవేల పల్లె పండుగ ద్వారా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో రహదారులు నిర్మాణం సాగుతున్నాయి. ఈ నిర్మాణాలను చీఫ్ ఇంజనీర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పనుల నాణ్యతలో రాజీపడవద్దని సూచించారు. వేగవంతంగా పనులు పూర్తి చేసే రెండో దశ నిర్మాణాలు త్వరలో నే మంజూరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ శాంతారావు, తెనాలి కార్యపాలక ఇంజనీర్ జె.ముత్యం బాబు, స్థానిక డీఈఈ ఎంఎంఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆసరాగా సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్
- ఇరువురికి నగదు చెక్కులు అందజేత



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్య శ్రీ వర్తించని వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల పరిధిలోని సీతారామపురం గ్రామానికి చెందిన కుంభేటి శకుంతలకు రూ.1.25 లక్షలు, చేబ్రోలు మండలం శెలపాడు గ్రామానికి చెందిన తాళ్లూరి సదాశివరావుకు రూ.1.02 లక్షల చెక్కులను నరేంద్ర కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధి అనారోగ్య బాధితులకు వరంలా మారిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడిందన్నారు. ఇలాంటి సమయంలో బాధితులకు సహాయ నిధి ద్వారా నిధులు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో పందులు సంచరించకూడదు

- మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు
- పందుల పెంపకందారులతో సమావేశం



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పందులు సంచరించకుండాచూడాలని పందుల పెంపకందారులతో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. పట్టణంలో శనివారం 29, 30, 31, 32వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. స్థానికులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. వార్డు ప్రజలు వీధులలో పందుల సంచారాన్ని ఫిర్యాదు చేశారు. ఆయన పందుల పెంపకందారుల వద్దకు వెళ్లి వార్డులలో ఉన్న పందులను తక్షణమే తరలించాలని ఆదేశించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో పందులు సంచరించడం వలన అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుందని, అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అందుకే వాటిని నిర్దేశిత ప్రదేశంలో పెంచుకోవాలని పెంపకందారులను ఆదేశించామని తెలిపారు. అనంతరం 16, 27వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు షేక్ నజీర్, గుమ్మడి ప్రసాద్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆలపాటికి ఘన విజయం చేకూర్చాలి

- కాఫ్‌చైర్మన్ అనిమిని రవినాయుడు

తెనాలి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణాగుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు పిలుపునిచ్చారు. తెనాలికి విచ్చేసిన ఆయన పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆలపాటి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కరపత్రాలను ఆవిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

టీడీపీ సభ్యత్వనమోదును ప్రారంభించిన రవినాయుడు

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు తెనాలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం పేదల అభ్యున్నతి కోసమేనన్నారు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన నాటి నుంచి అనేక సంస్కరణలు తీసుకువచ్చి పేదవాడి పార్టీ తెలుగుదేశం అని గర్వంగా చెప్పుకునేలా తీర్చిదిద్దారని తెలిపారు. చంద్రబాబు హయాంలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల ఐకమత్యంతో ముందుకు నడుస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి సభ్యత్వం ద్వారా పొందే ప్రయోజనాలను ఆ అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యం

- ఎంపీడీవో అత్తోట దీప్తి



తెనాలి రూరల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామాలను పచ్చదనం పరిశుభ్రతకు నిలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. శనివారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫటాఫట్.



ఎంపీడీవో అత్తోట దీప్తి

ప్ర: గ్రామాల్లో పరిశుభ్రతకు ఎటువంటి ప్రాధాన్యమిస్తున్నారు?

జ: గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య కార్మికుల ద్వారా కాలువలు పరిశుభ్రంగా చూడటం, ఇళ్లల్లో చెత్తను సేకరించడం, వాటిని ఊరికి దూరంగా తరలించడం, బ్లీచింగ్ చల్లడం, గడ్డి జాతి మొక్కలను నివారించడం వంటివి చేపడుతున్నాం.

ప్ర: పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో ఏఏ అభివృద్ధిపనులు చేపట్టారు?

జ: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టింది. వాటి ద్వారా ఆయా గ్రామాల్లో సుమారు రూ. 1.25 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నాం.

ప్ర: గ్రామాల్లో సమస్యలేమైనా మీ దృష్టికి వస్తున్నాయా..?

జ: పారిశుద్ధ్యంపై, చెత్తనిర్వహణపై ఎక్కువగా తన దృష్టికి తీసుకువస్తున్నారు. అందుకు ప్రధానంగా పలు గ్రామాల్లో డంపింగ్ యార్డు లేకపోవడమే.

ప్ర: దోమల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నాం. ఫ్రైడే ఫ్రైడే ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పారిశుధ్య నిర్వాహణపై కఠినమైన చర్యలు చేపడుతున్నాం.

ప్ర: గ్రామస్తులకు మీ ద్వారా ఏం చెప్పాలనుకుంటున్నారు?

జ: పంచాయతీ అధికారులు, సిబ్బందికి సహకరించాలని గ్రామస్తులను కోరుతున్నాం. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మగ్గుచూపాలి. దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టే ఆలోచన చేస్తున్నాం.

డీవీసీ హాస్పిటల్‌కు ఎన్ఏబీహెచ్ గుర్తింపు



ఎన్ఏబీహెచ్ గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న ఆస్పత్రి ఎండీ జ్యోతిర్మయి

పొన్నూరుటౌన్(చేబ్రోలు), అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ గుర్తింపు లభించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి తెలిపారు. శనివారం హాస్పిటల్‌లో ఎన్ఏబీహెచ్ సంస్థ ప్రతినిధులు గుర్తింపు పత్రాన్ని ఎండీ జ్యోతిర్మయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వ్యాపార ధోరణితో కాకుండా సేవా దృక్పథంతో గ్రామీణ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పాల రైతులకు రాయితీతో వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించడంలో ముఖ్యపాత్రను పోషిస్తున్నందుకే జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. ఇందుకు సహకరించిన హాస్పిటల్ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి

- మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

పొన్నూరుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును రద్దు చేయాలని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. పొన్నూరులో శనివారం మాలల యుద్ధ భేరి సభ జరిగింది. ఈ సభలో ఎస్సీ వర్గీకరణ, క్రీమీ లేయర్ తీర్పును రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రిజర్వేషన్ల ద్వారా రాజకీయ పదవులు పొందిన ప్రజా ప్రతినిధులు తమ స్వార్థ రాజకీయాల కోసం ఈ ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తే తగు రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీల వైఖరిని ఖండించారు. సుప్రీం కోర్టు సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, రాజకీయ పార్టీలలో కూడా ఓసీ కులాల్లో క్రిమిలేయర్ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాల ఉద్యోగులపై వేధింపులు ఆపాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో మాల మహాసభ నాయకులు, పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పించన్ పంపిణీ చేయాలి

- ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం నవంబరు నెలలో 1వ తేదీన పింఛన్‌ను ఇంటి వద్దే పంపిణీ చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన దీపావళి పండుగ రావటంతో ఆ రోజు బ్యాంకులకు సెలవు కావున పని చేయవన్నారు. 30వ తేదీన పంచాయతీ కార్యదర్శులు బ్యాంకు నుంచి పింఛను నగదును డ్రా చేయాలన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం : డీటీ దరియావలి

వట్టిచెరుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కుర్నూతలలో శనివారం నిర్వహించిన రీ సర్వే దరఖాస్తుల స్వీకరణ గ్రామసభలో డీటీ దరియావలి పాల్గొని అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రసాదు, విలేజ్ సర్వేయర్ గిడియన్, వీఆర్వో సాంబయ్య, సర్పంచ్ గోపాల కృష్ణ, ఉపసర్పంచ్ చిన్న, ఆదినారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో..



టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న గుంటూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు. రాష్ట్రంలో తొలి సభ్యత్వాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అందుకోగా, పోతినేని శ్రీనివాసరావు రెండో వారు. -మంగళగిరి

తహసీల్దార్ కార్యాలయంలో ట్రెయినీ ఐఏఎస్ సందర్శన



భూ రికార్డులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాద్

ప్రత్తిపాడు, అకోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయాన్ని ట్రెనీ ఐఏఎస్ అధికారి స్వప్నిల్ పవార్ జగన్నాద్ సందర్శించారు. కార్యాలయంలో సిబ్బంది విధులతో పాటు పాస్ పుస్తకాలు, భూ సర్వే రికార్డులు, భూమికి సంబంధించి సర్వే వంటి వివరాల గురించి ప్రత్తిపాడు తహశీల్దార్ కరుణ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా కార్యాలయంలో ఉండే సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



కోదండ రామాలయ ధ్వజస్తంభానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

తుళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులోని కొత్తురులో ఉన్న కోదండరాముడి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ ఆదివారం ఉదయం చేస్తారు. నాలుగు రోజుల నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. శనివారం శాంతి హోమం నిర్వహించి ధ్వజస్తంభానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఆరాధన కార్యక్రమాన్ని భక్తుల సన్నిధిలో అర్చకులు నిర్వహించారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భక్త కమిటీ తెలిపింది.

వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సిస్టర్లు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం డోలాస్‌నగర్ గుడ్ షెపర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో 900 మంది వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. 10 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ గోధుమపిండి, కేజీ పంచదార, కారం, పసుపు, సబ్బులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ ఉదయ, చాలీష్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లత, కరుణాలయ సిస్టర్ మనీష, సిస్టర్ రూబి, సిస్టర్ వసుంధర, పోతురాజు, కార్తీక్, నాగమణి, లక్ష్మి, సుకన్య పాల్గొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం

తాడేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామం అంబేద్కర్ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కూరపాటి సురేష్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మారుతీ ఫౌండేషన్ ఛైర్మన్ జంగాల సాంబశివరావు తరఫున వారి కుమారుడు తెలుగుయువత గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ శనివారం విజయవాడలోని హాస్పిటల్‌కు వెళ్లి, సురేష్‌ను పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. సురేష్ గత ఎన్నికల్లో పార్టీ తరఫున బాగా పని చేశారని, ఈ విషయం పార్టీ దృష్టికి తీసుకెళ్లి మరింత సాయం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొప్పలపూడి జ్యోతిబసు, దేవర భార్గవ, కూరపాటి క్రాంతి తదితరులున్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : కొల్లా

కాకుమాను, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరితో కలసి ఎమ్మెల్సీ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు.

ఆ పంచాయతీకి మేము రాము

- ఖాళీగా ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి పోస్టు
- గుంటూరుకు వెళుతున్న పంచాయతీ రికార్డులు

ప్రత్తిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ, నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. సాధారణ బదిలీల్లో బాగంగా మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు. క్రమం లోనే ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి జాన్ పీరాను కూడా ఇక్కడి నుంచి బదిలీ చేశారు. ఆయన బాధ్యతల నుంచి రిలీవింగ్ అవ్వడంలోనూ పెద్ద డ్రామానే నడిచింది. తీరా ఆ పంచాయతీకి మేము రాము.. అంటూ ఎవరూ బాధ్యతలు స్వీకరించడానికి ముందుకు రావడం లేదు. దీంతో కొంత కాలంగా ప్రత్తిపాడు కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి బదిలీ దగ్గర నుంచి రికార్డులు మొత్తం గుంటూరుకు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన సిబ్బంది రికార్డులను తెప్పించుకుని గతంలో తాము చేసిన తప్పులను కనిపించకుండా చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తుంది. రోజుకు కొన్ని రికార్డులను పంచాయతీ సిబ్బంది గుంటూరుకు తీసుకెళ్లడం ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది.

గత పంచాయతీ ఎన్నికల్లో ప్రత్తిపాడు పంచాయతీ ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ పంచాయతీని గెలుచుకోవడంతో పాటు ఆ పార్టీ పెద్దలే షాడో పరిపాలన చేస్తూ వచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ పెత్తనం టీడీపీకి చెందిన వ్యక్తికి అప్పగించి వైసీపీ పెద్దలు చిన్నగా పక్కకు జారుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తొలుత అయితే పంచాయతీ కార్యదర్శికి గదినే లేకుండా చేశారు. దీంతో కొంత కాలం కార్యదర్శికి కుర్చీ లేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పాలన మొత్తం టీడీపీ నాయకులు చేతుల్లోకి వచ్చిన తరువాత కూడా కార్యదర్శులు ఎవరూ ముందుకు రాకపోవడం వెనుక అసలు వాస్తవం ఏమిటో బయటకు రావడం లేదు.



ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం

కార్యదర్శి రిలీవింగ్‌లోనూ సమస్యే

నిన్నమొన్నటి వరకు ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన పంచాయతీ సెక్రటరీ జాన్‌పీరా రిలీవింగ్ లోనూ పెద్ద యుద్ధమే జరిగింది. జాన్ పీరాను పెదనందిపాడు మండలానికి బదిలీ చేశారు. అయితే ఏమి జరిగిందో ఏమో కాని షేక్ జాన్ పీరా ప్రత్తిపాడులో రిలీవింగ్ కావడానికి తొలుత సుముఖత చూపలేదు. ప్రత్తిపాడు ఎంపీడీవో ఫోన్ చేసి రిలీవింగ్ ఆర్డర్ తీసుకెళ్లమని చెప్పినా తీసుకెళ్లలేదు. దీంతో ఎంపీడీవో వాట్సప్‌లోనే జాన్‌పీరాను రిలీవింగ్ చేస్తూ ఆదేశాలు చేశారు. ఆ తరువాత ఇన్‌చార్జిని కూడా నియమించారు. తరువాత వారం రోజులకు జాన్‌పీరా ప్రత్తిపాడు నుంచి రిలీవింగ్ ఆర్డర్ తీసుకుని వెళ్లారు.

విద్యార్థుల భవిష్యత్తుకు వర్క్‌షాపులు, సెమినార్‌లు దోహదం

- ఎమ్మెల్యే రామాంజనేయులు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వట్టిచెరుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా విద్యార్థులకు ఎప్పటికప్పుడు వర్క్‌షాపులు, హాక్థాన్, సెమినార్‌లు వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించి వారిలో నైపుణ్యాన్ని వెలికి తీస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటమే లక్ష్యం కావాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ప్రారంభమైన కార్యక్రమానికి ఎమ్మెల్యే బూర్ల ముఖ్యఅతిథిగా హాజరై గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్యను అంది స్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుండటం మలినేని సంస్థల కృషి అభినందనీయమన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యా రంగంలో ఎంతో దూరదృష్టితో సాంకేతికంగా మహిళల్లో చైతన్యం కోసం 2008లో కళాశాలను ఏర్పాటు చేసి నేటికి 15 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రముఖ ఐటీ బహుళ జాతి సంస్థల్లో మలినేని విద్యార్థులకు స్థానం ఉండటం వారి ప్రతిభకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో తొలి రోజు ప్రముఖ సినీ గాయకులు శ్రీరామచంద్ర సంగీత విభావరి విద్యార్థినులను ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అలరింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, డీన్ అకడమిక్ ప్రొఫెసర్ జే కిషోర్, డీన్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ పీ రమేష్ బాబు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 54 అర్జీలు

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలకు రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. గొట్టిపాడులో జరిగిన శనివారం డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో వివిధ రకాల సమస్యలు తెలియజేస్తూ రైతులు 54 అర్జీలను అందించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకుంది. విధి నిర్వహణలో పోలీ సులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, యంత్రాలను గురించి పోలీసు సిబ్బంది విద్యార్థులకు వివరించారు. పోలీసు విధులను పుస్తకాల్లో మాత్రమే చదువుకున్న విద్యార్థులు ఓపెన్ హౌస్‌లో స్వయంగా పరిశీలించి మంచి అనుభూతి చెందారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్లు కే.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిస్వార్థపరుడు మన్నె చిన నాగయ్యకు నివాళి

వట్టిచెరుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మన్నె చిననాగయ్య వర్ధంతిని కుటుంబసభ్యులు నిర్వహించుకున్నారు. వట్టిచెరుకూరులోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన చిన నాగయ్య విగ్రహానికి ఆయన కుమారుడు మన్నె వెంకట తిరుపతిరావు, ఆయన మనవడు ముప్పా సాంబశివరావు, మాజీ సర్పంచ్ సాంబశివరావు, ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాదెండ్ల అప్పారావు, మన్నె కుటుంబసభ్యులు పాల్గొని విద్యార్థులతో కలసి ఘనంగా నివాళులర్పించారు.

రేవేంద్రపాడులో 140మందికి ఉచిత వైద్యపరీక్షలు

దుగ్గిరాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడులోని ఉచిత వైద్యశిబిరంలో 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు సురేష్‌బాబు, సాయి హర్షల సహకారంతో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహించిన వైద్యశిబిరంలో మధుమేహం, బీపీ, సాధారణ వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందించారు. గుంటూరు సురక్ష హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ బొందలపాటి సాంబశివరావు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ పలుకూరి మేరిమ్మ, వాసిరెడ్డి శ్రీనివాసరావు, దుగ్గిరాలయార్డు మాజీ ఛైర్మన్ కేసంనేని శ్రీధర్, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో ప్రదర్శన



మెప్మా బజార్‌ను సందర్శిస్తున్న వెంకటరావు తదితరులు

మంగళగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మెప్మా బజారు ఏర్పాటు చేశారు. ఈ మెప్మా బజారును ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వివిధ రకాల వస్త్రాలు, గాజులు, పోషకాహారం, చేతి వృత్తులకు సంబంధించిన వస్తువులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృతంగా మార్కెటింగ్ కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి శనివారం మెప్మా బజార్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే.శకుంతల, మెప్మా సిటీ మిషన్ మేనేజరు మాలతి, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడానికి మెప్మా బజార్‌లు ఎంతో దోహదం చేస్తాయని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణుడి గుడి వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కంఠంనేని శకుంతల శనివారం ప్రారంభించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (స్వయం సహాయక సంఘాలు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఇతర నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకా పుల్లారెడ్డి, కొర్రపాటి విజయకుమార్, నక్కా నవీన్‌రాజా, పోతాబత్తు ని శ్రీనివాసరావు, సలాం, తోట సాంబశివరావు, హరికృష్ణ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అమరావతి రైల్వే లైన్‌కు ఆమోదం శుభపరిణామం

- చిల్లపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అమరావతి రైల్వేలైన్‌కు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామమని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. మంగళగిరి జనసేన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ అమరావతి రాజధానికి వరంలాంటిదన్నారు. సుమారు రూ.2,245 కోట్లతో 57 కిలో మీటర్ల మేర ఏర్పాటు చేయనున్న కొత్త రైల్వే లైను అమరావతికి మణిహారంగా నిలుస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతి విధ్వంసంతోపాటు ఐదేళ్ల రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల ముందు మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేశ్ వేగవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. మంగళగిరిలో వంద పడకల సమగ్ర ఆస్పత్రి నిర్మాణానికి, స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. నియోజకవర్గాన్ని దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

62 మంది విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, దీపక్‌జైన్

తాడికొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మనిషి దేహంలో కళ్ళు అత్యంత ప్రధానమైనవి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివా సరావు పేర్కొన్నారు. శనివారం తాడికొండలోని శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని దాతలు దీపక్ జైన్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరులోని అరిహంత్ ఆప్టికల్స్ అధినేత దీపక్‌జైన్ పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 62 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారని తెలిపారు. మూడు సంవత్సరాలుగా పాఠశాలలోని విద్యార్థుల కంటి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 7వ తరగతి చదువుతున్న సీహెచ్ సౌజన్య దయాబిటెక్-1తో వ్యాధి నియంత్రణకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తానని దీపక్ జైన్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో త్రిపురనేని మల్లేశ్వరరావు, గోపీచంద్, విద్యాకమిటీ ఛైర్మన్ ఎం.రవి, ప్రధానోపాధ్యాయులు ఏవీవీ ప్రసాద్, చంద్రశేఖర్, నేతి వెంకట రమణయ్య ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ యువజన ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్‌లో చేరిక



సురేష్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న వైఎస్ షర్మిల

తుళ్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలివేంద్రం సురేష్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ఆంధ్రరత్న భవనంలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన సురేష్‌కు షర్మిల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో మేమందరం బలిపశువులమయ్యామని, వైసీపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఈ సందర్భంగా చలివేంద్రం సురేశ్ అన్నాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా రవిచంద్ర, అమరావతి నగర అధ్యక్షుడు కొమ్మినేని సురేష్, అడుసుమిల్లి శ్రీనివాస్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల ఆధునికీకరణ : ఎంఈవో కెన్నడీ

కాకుమాను, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదులను సాంకేతికంగా ఆధునీకరణ చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో జరుగుతున్న సాంకేతిక (ఇంటర్నెట్) అనుసంధాన విధానాన్ని ఎంఈవో -2 విజయ్ భాస్కర్‌తో కలసి పరిశీలించారు. సులభతర విద్యావిధానానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ ఏపీపీఏఆర్ విధానం విద్యాసంస్థల మధ్య సులభతర బదిలీలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శీలం అంకారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దోసా ఫౌండేషన్, ఉయ్యూరు ఫౌండేషన్ ఫాంగ్‌టెక్ వారి సమకారంతో ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు యూఎస్ఏకు చెందిన ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఇక్కడ నిర్వహించే ఈ వైద్యశిబిరంలో అన్ని వయసుల వారికి ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించనున్నారు.

పశుగణనను వేగవంతం చేయాలి

- మాజీ ఎంపీపీ శరత్‌బాబు

కాకుమాను, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువులు, గొర్రెలు, ఆవులు తదితర పశువుల గణనను వేగంగా పూర్తి చేయాలని మాజీ ఎంపీపీ శరత్‌బాబు అన్నారు. స్థానిక పశువుల వైద్యశాలలో శనివారం 21వ అఖిల భారత పశుగణన వాల్ పోస్టర్లను టీడీపీ నాయకులు నల్లమోతు పూర్ణచంద్రరావు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్‌లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న సిబ్బంది గ్రామాల్లో ప్రతి కుటుంబానికి రకరకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. పశుగణను ప్రక్రియను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని తెలిపారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బూర్ల రామాంజనేయులు

కార్యకర్తలే టీడీపీ బలం : ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పార్టీని స్థాపించినప్పటి నుంచి ఈ రోజు వరకు టీడీపీకి అండగా నిలబడింది కార్యకర్తలేనని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక విద్యానగర్‌లో ఆయన కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు, సూపర్‌సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ పథకాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు కావాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ కార్డు కష్టకాలంలో కార్యకర్తకు అండగా నిలబడుతుందని అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు ప్రతి రోజు ఒక మంచి కార్యక్రమాన్ని ప్రజలు ముందు పెడుతున్నారని అన్నారు. అనంతరం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, మోదీ చిత్రపటాలను పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు భీమనేని వందనాదేవి, కూటమి నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, గంధం సురేష్, పంచుమర్తి శేషు, కల్లూరి శ్రీనివాస్, ఇమ్మడి మల్లికార్జునరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● అనంతవరప్పాడులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ అధ్యక్షుడు మోపర్తి శంకర్, సర్పంచ్ దారా వెంకటరావు, ఉపసర్పంచ్ యర్రగుంట్ల శేఖర్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, నాగిశెట్టి నాగరాజు, క్లస్టర్ మర్రి సాంబయ్య, మిలటరీ మస్తాన్ వలి, జే సుమన్, ఉప్పుటూరి సాంబశివరావు, గోపీకృష్ణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య తెలిపారు. తాడికొండ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండటానికి చంద్రబాబునాయుడు ఎప్పుడు కృషి చేస్తారని చెప్పారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు వారిని ఆదుకోవటానికి పార్టీ నాయకులు ముందుటారన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక నాయకుల సహకారంతో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాడికొండ, తుళ్లూరు, ఫిరంగిపురం, మేడికొండూరు మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, తలశిల ప్రసన్నకుమార్, మల్లిపెద్ది రమేష్, మండవ చిన నరసింహారావు, ముఖ్యనాయకులు నార్నె శ్రీనివాసరావు, పాములపాటి శివన్నారాయణ, నూతలపాటి రామారావు, పుట్టి రామచంద్రరావు, ఆరే పున్నారెడ్డి, పెరికల హృదయరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు యడ్లపల్లి సాంబశివరావు, సాంబశివరావు, షేక్ అబ్దుల్ ఘనీ, శాఖమూరి కృష్ణారావు, సాంబిరెడ్డి, కోటేశ్వరరావు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ పంపిన పెళ్లికానుక అందజేత



పెనుమాకలో, తాడేపల్లి పట్టణంలో వధూవరులకు కానుక అందిస్తున్న టీడీపీ నాయకులు

తాడేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాకలో బొక్క మోహనరావు (లేటు) కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులు సంధ్యారాణి-లీలాభరత్‌లకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుకను శనివారం టీడీపీ నేతలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్, కొల్లి నాగార్జున, బొక్కా నాగరాజు, డోలా కల్యాణ్, బొక్కా కిరణ్, బొక్కా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం 8వ వార్డులో పడమరల వెంకటరమణ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులు జ్యోతి-సురేష్‌లకు మంత్రి లోకేశ్ పంపిన పెళ్లి కానుకను శనివారం టీడీపీ నేతలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెంటపల్లి రాజేష్, బెజ్జం రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా

మంగళగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంటీఎంసీ పరిధిలోని క్లాప్ ఆటోడ్రైవర్లు శనివారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరవధిక సమ్మెలో భాగంగా పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ ఐదు రోజులుగా కార్పొరేషన్ పరిధిలోని 64మంది ఆటో డ్రైవర్లు సమ్మె చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎంటీఎంసీ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.